RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 54 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం , ఆగస్టు, 13, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 54 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, August, 13, 2025 | PAGES : 8 RS : 4 /- |




## చైనాపై వెనక్కుతగ్గిన ట్రంప్

**వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం**

**- ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేసిన ట్రంప్**

వాషింగ్టన్: భారత్ సహా ప్రపంచ దేశాలపై సుంకాల మోత మోగిస్తున్న డొనాల్డ్ ట్రంప్.. ఆయా దేశాలతో వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటున్నారు. అయితే చైనా విషయంలో మాత్రం కాస్త వెనక్కి తగ్గినట్లు తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. చైనాపై తొలుత సుంకాల మోత మోగించిన ట్రంప్.. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వాణిజ్య ఒప్పందం చర్చల గడువును పొడిగించినట్లు చైనా కూడా తన అధికారిక మీడియా ద్వారా వెల్లడించింది.

చైనాతో వాణిజ్య ఒప్పందానికి తొలుత విధించిన 90 రోజుల గడువు మంగళవారం అర్ధరాత్రితో ముగియనున్న నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు.





## వరంగల్ జిల్లాలో కుండపోత వర్షం..

**స్తంభించిన జనజీవనం**

**- ఖిలా వరంగల్ అగడ్త చెరువు ఉధృతి**

**- రైల్వే అండర్ బ్రిడ్జ్ కింద నుంచి రాకపోకలు బంద్**

**- ప్రధాన రహదారులపైనా వరద ప్రభావం**

ఖిలావరంగల్, తెలంగాణ దిశ : వరంగల్ జిల్లా వ్యాప్తంగా వాన దంచికొట్టింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నగరంలోని చెరువులు, కుంటలు పొంగిపొర్లడంతో వరద నీరు ఇళ్లను ముంచెత్తింది. పలు మండలాల్లో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. అత్యధికంగా సంగెం మండలంలో 178.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే ఖిలావరంగల్‌లో 155.0 మి.మీ., వరంగల్‌లో 148.8 మి.మీ., వర్ధన్నపేటలో 125.4 మి.మీ., ఖానాపూర్‌లో 108.8 మి.మీ. అతి భారీ వర్షం కురిసింది. వర్షపాతం నమోదైంది. అలాగే గీసుగొండలో 90.4 మి.మీ, దుగ్గొండిలో 84.2 మి.మీ, నల్లబెల్లిలో 66.4 మి.మీ, నర్సంపేటలో 86.4 మి.మీ, చెన్నారావుపేటలో 85.4 మి.మీ, రాయపర్తిలో 90.8 మి.మీ, పర్వతగిరిలో 88.6 మి.మీ, నెక్కొండలో 82.4 మి.మీ భారీ వర్షం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.



## శిక్షాకాలం పూర్తయిన వారిని వెంటనే విడుదల చేయాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం**

**సుఖ్‌దేవ్ పహిల్వాన్ కేసు విచారణలో కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, :నిర్ణీత శిక్ష పూర్తి చేసుకొని మరే ఇతర కేసులో దోషిగా లేదా నిందితులుగాలేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీం ఆదేశించింది. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలు ఇంకా జైల్లోనే ఉండటంపై ఆందోళన సుప్రీం కోర్టు వ్యక్తం చేసింది.. వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 2002లో దిల్లీలో నితీశ్ కటారా అనే వ్యాపారవేత్త హత్య కేసులో దోషిగా తేలిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ శిక్షాకాలం పూర్తయినందున అతడిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే వైఖరి కొనసాగితే దోషి జైల్లోనే మరణిస్తాడని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పహిల్వాన్‌ను ఇంకా జైల్లోనే ఉంచడంపై ప్రశ్నించిన ధర్మాసనం.. ఆయనతో సహా నిర్ణీత జైలు శిక్ష పూర్తయిన దోషులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది.



## పేదలు కడుపునిండా తినాలనే.. సన్నబియ్యం పంపిణీ

**రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ దిశ :** పేద వారు కడుపు నిండా నాలుగు ముద్దలు తినాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం రాత్రి కాటారం మండల కేంద్రంలోని బిఎల్ ఎం గార్డెన్ లో కాటారం డివిజన్ పరిధిలోని మండలాల ప్రజలకు నూతన రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూగత ప్రభుత్వ హయాంలో 10 సంవత్సరాల కాలం పాటు పేద కుటుంబానికి ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు.



## మోడీతో పాక్‌కు తీవ్ర నష్టం

**- భారత్‌పై యుద్ధం మినహా మరోదారి లేదు**

**- పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ప్రేలాపన**



## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాక్రాంతి, ఆగస్టు 12: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని హైదరాబాదులోని వారి నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అల్ఫోర్స్ విధ్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని నరేందర్ రెడ్డి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రానికి అనేక పెట్టుబడులు,పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని వారు హర్షం వ్యక్తం చేస్తూ అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## నిరాధార ఆరోపణలతో ప్రతిష్టకు భంగం

**బండి సంజయ్‌కు కెటిఆర్ లీగల్ నోటీస్ జారీ**

**హైదరాబాద్, తెలంగాణ దిశ :**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండసంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసులను పంపించారు.



## మంత్రి పదవిపై మరోమారు రాజగోపాల్ కస్సుబుస్సు

**- ఇద్దరం అన్నదమ్ములం సమర్థులమే అని వ్యాఖ్య**

**- ఖమ్మంకు లేని నిబంధన నల్లగొండకే ఎందుకో**

నల్గొండ, తెలంగాణ దిశ : మంత్రి పదవి విషయంలో తనకుకావాలనే అన్యాయం చేయడంపై మరోమారు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పార్టీనేతల తీరుపై విమర్శలు గుప్పించారు. కేబినేట్‌లో ఇద్దరు అన్నదమ్ములకు పదవులు ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నవారు, పార్టీలో ఇద్దరు ఉన్నారని ముందు తెలియదా అని కూడా ప్రశ్నించారు. మంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని..



## జమ్మూకశ్మీర్‌లో 1508 మీటర్ల భారీ త్రివర్ణ పతాకంతో ర్యాలీ..

**- జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో తిరంగా ర్యాలీ**

దోడా: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో సోమవారం విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుమారు 1508 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దోడా జిల్లా డిప్యూటీ కమీషనర్ హర్విందర్ సింగ్ నేతృత్వంలో ఈ మెగా తిరంగా ర్యాలీ జరిగింది. వెల్కమ్ దోడా ఎంట్రీ గేటు నుంచి కమ్యూనిటీ హాల్ వరకు భారీ త్రివర్ణ పతాకంతో ఈ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ దేశభక్తిని చాటుకుంటూ దేశభక్తి గీతాలను ఆలపిస్తూ, నినాదాలు చేశారు.

# గ్రామీణ క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

### -రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి




**మక్తల్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధి జరగాలంటే క్రీడా మౌలిక సదుపాయాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మక్తల్ నియోజకవర్గం మక్తల్, ఆత్మకూరు, నార్వ,ఉట్కూరు మండల కేంద్రాల్లో, అమరచింత, వనపర్తి జిల్లా కేంద్రాల్లో క్రీడా మైదానాలు మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం అధికారులతో కలిసి ఆయన ఆయా ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు అభివృద్ధి చెందాలంటే మండల, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండాలని, ఆ ఆలోచన తోటే ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు లేని మండల కేంద్రాల పైన దృష్టి సారిస్తున్నామని తెలిపారు.అంచలంచలుగా అన్ని నియోజకవర్గాల్లో, మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. క్రీడల అభివృద్ధికి నూతన క్రీడా విధానం ప్రకటించుకొని దాని పటిష్టంగా అమలు చేయడానికి జరుగుతున్న కృషిలో భాగంగానే క్రీడా మైదానాల నిర్మాణం, మౌలిక సదుపాయాల పై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఒక దశాబ్ద కాలం నుండి ఎంతో వెనక బాటుకు గురైన మక్తల్ నియోజకవర్గంలో సమర్థవంతమైన క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించడానికి కృషి చేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో గ్రామీణ క్రీడా రంగ మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తూ స్పష్టమైన కార్యాచరణకు పూనుకోవడం హర్షనీయమని అన్నారు.పోస్టర్ ఆవిష్కరణఅన్ని రాష్ట్రాల్లో కన్నా ఈ సంవత్సరం



తెలంగాణ రాష్ట్రంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాల దినోత్సవం అని పురస్కరించుకొని స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 25వ తేదీన ఎల్ బి టెన్నిస్ కాంప్లెక్స్ లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ పర్యటనలో మంత్రి వాకిటి శ్రీహరి గారి వెంట స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి స్థానిక ప్రజా ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు చంద్రారెడ్డి, రవీందర్, భాష, అశోక్ కుమార్ మధు తదితరులు పాల్గొన్నారు.

## జనప్రియ టౌన్ షిప్ డ్రైనేజీ సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం



**మల్లాపూర్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ) :**
"బస్తీ బాట" కార్యక్రమంలో గుర్తించిన ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించినట్లు కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ నేత నెమలి అనిల్ కుమార్ తెలిపారు.ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. వెంటనే అధికారులతో మాట్లాడి ప్రధాన సమస్య జనప్రియ టౌన్ షిప్ డ్రైనేజీ వ్యవస్థను మార్చే విధంగా త్వరలో బాక్స్ డ్రైనేజీ ఎక్సటెన్షన్ పనులను మొదలుపెట్టాలని సూచించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మల్లాపూర్ ప్రధాన కార్యదర్శి తండ్రా శ్రీకాంత్ రెడ్డి, జనప్రియ టౌన్ షిప్ అసోసియేషన్ సభ్యులు గణేశ్, ఆంథోనీ, దయాకర్ రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి ఆదేశాలతో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉప్పల్ రహదారి పనులు

### - కమిషనర్ గ్రీన్ సిగ్నల్‌తో త్వరలోనే ప్రారంభం కానున్న పనులు

**ఉప్పల్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ రింగురోడ్డు– నల్ల చెరువు వరకు రహదారి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారిపై వాహనదారుల, స్థానికుల కష్టాలు తీరనున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి కృషితో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాలతో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ రహదారిని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. కారిడార్‌తో సంబంధం లేకుండా రోడ్డు నిర్మాణం, మరమ్మతు వంటి పనులను వెంటనే చేపట్టనున్నారు. ఉప్పల్ –నారపల్లి మధ్యలో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ పనులతో ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారి అధ్వాన్నంగా మారింది. వర్షాకాలంలో వరద, బురద.. వేసవిలో దుమ్ము చెలరేగుతుంది. ఇలాంటి పరిస్థితులలో పరమేశ్వర్‌రెడ్డి చేసిన కృషి ఫలించింది. ఉప్పల్‌లో వరంగల్ జాతీయ రహదారి నేషనల్ హైవేస్, ఆర్ అండ్ బి కంట్రోల్‌లో ఉంది. ఏదైనా రోడ్డు అభివృద్ధి, మరమ్మతు పనులనే ఈ రెండు విభాగాలే చేపట్టాలి. ఎలివేటెడ్ కారిడార్ పనులు ముందుకు కదలకపోవడంతో ఉప్పల్‌లో ఈ రెండు విభాగాలు ఎలాంటి



పనులను చేపట్టకపోవడంతో రహదారి పరిస్థితి దుర్భరంగా తయారైంది. ఇదే విషయాన్ని పరమేశ్వర్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్ నుంచి ఎన్ఓసీ తీసుకొని ఈ పనులను జీహెచ్ఎంసీకి అప్పగించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించడమే కాకుండా వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు, ఆర్ అండ్ బి ఉన్నతాధికారి ధర్మారెడ్డికి మంత్రి ఫోన్‌లో ఇదే విషయాన్ని చెప్పారు. ఇద్దరూ కూడా సానుకూలంగా స్పందించడంతో అతి త్వరలోనే సమ్యకు పరిష్కారం లభించనుంది. పరమేశ్వర్‌రెడ్డి చూపిన చిన్న చొరవతో లక్షలాది మంది కష్టాలు తీరనున్నాయి.

# కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా : కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్ పల్లి డబల్ బెడ్ రూమ్స్,వినాయక నగర్ కాలనీలలో ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా త్వరలో డబుల్ బెడ్ రూమ్ కాలనీలోచౌక దారుల దుకాణం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చౌక దారుల దుకాణంలో పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రమంతా శ్రీకారం చుడుతున్న సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డబల్ బెడ్ రూమ్ వాసులు అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో



తీవ్ర నీటి కొరత ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమ్యసలపై సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినాయక నగర్ కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించి సదురు కమిషనర్, అధికారులతో మాట్లాడి పనులను త్వరలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, నర్సింహా, రాజయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, కాలనీ అధ్యక్షులు సలీమ్, కుమార్ యాదవ్, వేణు, సాధు యాదవ్, పరశురామ్ గౌడ్, నాగరాజు, శ్రీనివాస్ చారి, గురువారెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, నర్సింగం శ్రవణ్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం మీ చేతుల్లోనే ఉంది

### - రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ ఆకస్మిక తనిఖీ
### - మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం మీ చేతుల్లోనే ఉందని మేడ్చల్ అదనపు కలెక్టర్ రాధిక గుప్తా విద్యార్థుల ఉద్దేశించి అన్నారు. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు క్రమశిక్షణ, ప్రణాళిక బద్ధంగా కార్యచరణ ప్రణాళికతో కష్టపడుతూ ఇష్టంగా చదివి విజయం సాధించాలని ఆమె ఆకాంక్షించారు. మంగళవారం మేడ్చల్ మండలం కిష్టాపూర్ లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థులకు భోజన వసతి, వంటగది, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న%శీ%, రాత్రి భోజనం, స్నాక్స్ ఇస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివే విద్యార్థులకు అన్ని



విధాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వారి సబ్జెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని, వారికి అవసరమైన మార్గనిర్దేశ సూచనలు చేసారు. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు. విద్యార్థులు స్పందిస్తూ కంప్యూటర్లు, ల్యాబ్ కావాలని తెలుపగా, అదనపు కలెక్టరు తప్పకుండా సమకూరుస్తామని హామీ ఇచ్చారు. స్కూల్, కాలేజీ మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, అన్ని సౌకర్యాలు ఉన్నాయా ఏమైనా మరమ్మత్తులు అవసరమా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న%శీ%, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని అదనపు కలెక్టరు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ) :** అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నుండి మంజూరైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో ఈ చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు తమ చికిత్సల అవసరాల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లబ్ధి పొందవచ్చునని వివరించారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గాజుల రామారం కు చెందిన లాకోటి విజయేందర్ కు రూ. 60 వేలు, మహమ్మద్ ఇలియాస్ కు 18,500, యాస్మిన్ సుల్తానాకు రూ. 20 వేలు, అంజిరెడ్డి బస్తీ వాసి తెల్ల రామకృష్ణకు రూ. 27 వేలు, 132 డివిజన్ రంగారెడ్డి నగర్ వాసి కావడి బాల్ రెడ్డి కి రూ. 30 వేలు, సీఎంఆర్ చెక్కులను



(మంజూరీ పత్రాలను) ఆయన అందజేశారు.
ఈ కార్యక్రమంలో మెడిసిన్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యంరెడ్డి, సంజీవరెడ్డి, గాగిల్లాపూర్ మాజీ సర్పంచ్ బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు ఎండి లాయక్, గణేష్, సోమన్న గారి శ్రీధర్ రెడ్డి, గఫార్, ఎండి నయీమ్, రహీం, కలీం, హరికిరణ్, కరణ్, నరసింహ రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్ మున్సిపాలిటీలో రూ. 78. 34 కోట్లతో మౌలిక సదుపాయాలు

### - కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో రూ. 78. 34 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా బిఆర్ఎస్ పాలన లో దుండిగల్ మున్సిపాలిటీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలు బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయడం గొప్ప వరమని అన్నారు.



ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరు శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మైసి గారి శ్రీనివాస్, గాగిలాపూర్ మాజీ సర్పంచ్ బల్ రాజ్, శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముత్యం రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, సాదు యాదవ్, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

# సమాజ సేవలో సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి

### - వర్షం నీరు నిలిచిపోవడంతో... ఇబ్బందిపడ్డ వాహనదారులు
### - హైడ్రా సిబ్బంది సాయంతో సమస్య తీర్చిన సిద్ధనోళ్ల

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా నగరంలో వర్షం కురుస్తోంది. చాలా చోట్ల నీరు నిలిచి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే సీన్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కూడా జరిగింది. 125 డివిజన్ గాజులరామారం చిత్తారమ్మ ఆలయం వెనుక వైపు వర్షం నీటితో రోడ్డు నిండిపోయింది. నాలా బ్రిడ్జ్ పైన వర్షం కారణంగా మెయిన్ రోడ్డులో రెండు అడుగుల ఎత్తున వాన నీరు జామ్ కావడంతో... స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.




ఈ విషయం గమనించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి నీటిని స్థానికులతో కలిసి తొలగించేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో హైడ్రా సిబ్బందిని పిలిచి నీళ్లు తొలగించారు. వర్షం నీటి సమస్య తొలగడంతో... స్థానికులతో పాటు... ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ...సిద్ధనోళ్ల సంజీవ రెడ్డిని అభినందించారు.

# బాచుపల్లిలో బిజెపి తిరంగా ర్యాలీ

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ)** :బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాచుపల్లి బిజెపి ఆధ్వర్యంలో 21 డివిజన్ డబల్ బెడ్ రూమ్ 4 బ్లాక్ క్వాటర్స్ సముదాయంలో మంగళవారం తిరంగ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. భారత జాతీయ తిరంగా జెండాలతో ర్యాలీ డబల్ బెడ్ క్వాటర్స్ మధ్య ర్యాలీ సాగింది. వివిధ కాలనీల ప్రజలు బిజెపి శ్రేణులు దేశభక్తి నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో బిజెపి బాచుపల్లి అధ్యక్షులు ఎన్. ప్రసాద్ రాజు మాట్లాడుతూ భారత దేశం 79 సంవత్సరాల స్వతంత్ర అభియాన్ ఉత్సవాలలో భాగంగా ఈ తిరంగా



ర్యాలీ జరపడం, దేశ ఐక్యత, సమగ్రతకు చిహ్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, బిజెపి నాయకులు కార్యకర్తలు జాతీయ వాదులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం..!

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉ?కవగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే.అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది. 2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి.2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది.ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్ష్యం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ.స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థ్యం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది. పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి.

# మరో మూడు రోజులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 12, (తెలంగాణ దిశ) : హైదరాబాద్ లో రాబోయే మూడు రోజులు, అంటే ఆగస్టు 13 బుధవారం నుండి ఆగస్టు 15 శుక్రవారం వరకు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల కనుగుణంగా హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతాలు (మేడ్చల్ జిల్లా, సైబరాబాద్) ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తెలిపారు. హైదరాబాద్ లోని ఇతర ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 10/15 సెం.మీ కంటే ఎక్కువ, కొన్ని చోట్ల 20 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నదన్నారు. కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రాబోయే 3 రోజులు వాహనాల రాకపోకలను తగ్గించుకోవాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.



వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# మహిళను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

గోదావరిఖని, తెలంగాణ దిశ : బోగిరి విజయ్ కుమార్ తండ్రి రాములు అను వ్యక్తి గత కొంతకాలంగా గంగానగర్ కు చెందిన ఒక మహిళను వేధిస్తున్నాడ ని అట్టి మహిళా నిన్న గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి విచారించి ఈరోజు విజయ్ కుమార్ ను పట్టుకొని అరెస్టు చేయడం జరిగింది.ఇట్టి కేసులో మహిళ తెలిసినంతవరకు ఫోన్లో మాట్లాడినందుకు అట్టి ఫోన్ రికార్డును ఆసరాగా చేసుకొని ఆమెహిళను వేధించడం మొదలు పెట్టినాడు. ప్రజలందరికీ పోలీస్ శాఖతరపున విజ్ఞప్తి ముఖ్యంగా మహిళలకు ఆడపిల్లలకి తెలిసిన వ్యక్తులైనా, తెలువని వ్యక్తులతోనైనా ఫోన్లో, సోషల్ మీడియా లో ఎక్కువసేపు మాట్లాడటం కానీ,మెసేజ్లు పంపడం కానీఫోటోలు షేర్ చేయడం గానీ చేయకూడదని, వాటి వల్ల సమస్యలు ఎదురవుతాయని తెలియజేస్తున్నాం. సోషల్ మీడియాలో మహిళలు ఎలాంటి ఫోటోలను గాని, వీడియోలను గాని పోస్ట్ చేయరాదని, ముఖ్యంగా వారి కుటుంబా కి సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేయరాదని తెలియజేస్తున్నాము. సైబర్ నేరస్థులు మహిళల యొక్క ఆడపిల్లల యొక్క ఫోటోలను మార్ఫింగ్ చేసి వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తారు.

# నాగారంలో మువ్వన్నెల జండాలతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



నాగారం, ఆగస్టు 12, (తెలంగాణ దిశ) : బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాగారం మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారం నేతాజీ నగర్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి, రాంపల్లిలోని భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మువ్వన్నెల జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ తిరంగా ర్యాలీలో భాగంగా దేశ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుభ్రపరచడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు నాగరాజు, మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి పాండే, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బతుకు నావను ఈదే ధైర్యం ఉండాలి..

తిరుమ, తెలంగాణ దిశ : కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. జీవితం అంటే వడ్డించిన విస్తరి కాదు. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో ఊహించడం కష్టం అందుకే కష్టాలను తట్టుకుని నిలబడే ఆత్మస్థైర్యం కలిగి ఉండాలి. కుంగిపోతే మనలను ఎవరూ కాపాడలేరు. పదమూడేళ్ళ అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం..బతుకంతా అడవుల పాలు. అయినా సరే పాండవులు బతికారు. అరణ్యవాసంతం తరవాత శ్రీరాముడు చక్కగా రాజ్యం పాలించాడు. అడవుల్లో ఉన్నా, రాజ్యాధికారంలో ఉన్నా ఒకేలా ఉండాలని ఈ రెండు పురాణాలు మనలను గుర్తు చేస్తుంటాయి. ఎవరు ఈ బతుకును వద్దన్నారు? చాకచక్యంగా జీవిత నావను నెట్టుకుపోతే ప్రయాణ దూరం తగ్గిపోతుంది. లక్ష్యం చేరువవు తుంది. అన్నీ ఉన్న వాళ్ళు బతుకుతారు. ఏమీ లేనివాళ్ళు సైతం బతుకుతారు. కళ్ళులేనివారు, కాళ్ళులేనివారు కూడా అద్భుతాలు చేస్తున్నారు. సర్వాంగాలతో చక్కటి శరీరం ఇచ్చిన సర్వేశ్వరుడికి మనం ఎంతో రుణపడి ఉండాలి. మరణం గురించి పదేపదే ఆలోచించకన్నడేదు. మరణం బతుకు రహస్యం ముడి విప్పుతుంది. బతుకు జీవనసారం అనుభవంలోకి తెస్తుంది. అపరిష్కృతంగా ఉన్న సమస్యను నల్ల బల్ల మీద నుంచి తుడిచి వేస్తే సమస్య పరిష్కారం కాదు. శోధించి, సాధించాలి. జీవించి చూపించినత్వాన్ని సాధించాలి.చెట్టు పైకి ఎదుగుతాయి. నిన్నటి వరకు పాకే పిల్లాడు ఈ రోజు నడుస్తాడు. సన్నటి పాయలుగా పారే నది, ప్రవహించి ప్రవహించి సముద్ర రూపం పొందుతుంది. గొప్పగా బతకడంలోనే బతుకు రహస్యం బోధ పడుతుంది. దివ్యంగా బతకడంలో జీవనపరమార్థం నెరవేరుతుంది. బతకడం ఎవరూ నేర్పనక్కర్లేదు. శరీరంలో,మనసులో,ఆత్మలో బతుకు విత్తనం ఎప్పుడో వేశాడు ఆ పైవాడు.దాని మీద ఆనందం అనే ఎరువు వేసినంతోషం అనే నీటు జల్లుతూ ఉండాలి. అప్పుడు బతుకు వృక్షం పచ్చగా ఎదుగుతుంది. మనం వృక్షాలుగా మారితే చిలుకలు వాటంతట అవే వచ్చి వాలుతాయి. కోకిలలు చెట్టును వేదికలు చేసుకుని కచేరీలు చేస్తాయి. బతుకు ఒక పాట. హాయిగా పాడుకోవాలి. బతుకు ఒక ఉత్సవం. ఆనందానికి అర్థం చెప్పాలి. విషాదాన్ని ఉండటం ఆధ్యాత్మికత అని ఎవరూచెప్పలేదు. విషాదాన్నిజీవితం నుంచితరిమికొట్టడమే దివ్యమైన జీవితం! అజ్ఞానమే బతుకును అవగాహనకు రానివ్వకుండా చేస్తుంది.

# కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియను నిలిపివేయాలి

హెచ్ బి కాలనీ, ఆగస్టు 12, (తెలంగాణ దిశ): హెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్ వేలం ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. హౌసింగ్ బోర్డు డిపార్ట్ మెంట్ వారు వేలం వేయుటకు నిర్ణయం తీసుకొని ముందస్తు జాగ్రత్తగా కాలనీల సంక్షేమ సంఘాలకు కెవిఎట్ పిటిషన్ వేసి నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఈ కమ్యూనిటీ హాల్ ను కాపాడి జీహెచ్ఎంసీ కి అప్పగించి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమం లోస్థానిక కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ తో పాటు హెచ్ బి కాలనీ ఫేజ్-2 అధ్యక్షులు వెంకటాచారి, ఫేజ్-1అధ్యక్షులు శివరాంప్రసాద్,



గోవిందరెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సుంకాలతో.. ఫార్మా పరిశ్రమకు దెబ్బే..!

- మన సరఫరాలలో అధిక భాగం జనరిక్ మందులే
- సుంకాలతో వాటి తయారీదారులకు మరింత నష్టం
- దిగుమతి సుంకాలు రద్దు చేయాలని కోరుతున్న ఔషధ కంపెనీలు
- అమెరికా ఆరోగ్య వ్యవస్థకూ ఇబ్బందేనంటున్న నిపుణులు



న్యూఢిల్లీ : భారతీయ ఔషధాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో దేశంలోని మందుల తయారీదారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రస్తుతం మన దేశం నుండి అమెరికాకు ఏటా తొమ్మిది బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఔషధాలు, వ్యాక్సిన్లు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా ప్రతీకార సుంకాలు విధిస్తే తమపై పడే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యాపార వ్యూహాలపై ఔషధ తయారీ సంస్థలు సమీక్షలు జరుపుతున్నాయి. అమెరికాకు మందులు ఎగుమతి చేయడం ద్వారా తమ ఆదాయాలకు భారీగా గండి పడుతుందని దేశీయ ఫార్మా సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా నుండి దిగుమతి అవుతున్న మందులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. తద్వారా ప్రతీకార చర్యల నుండి తప్పించుకోవచ్చునని భావిస్తున్నాయి.

వచ్చే ఆదాయం స్వల్పమే: భారత్ నుండి దిగుమతి అవుతున్న ఔషధాలపై ప్రస్తుతం అమెరికా ఎలాంటి సుంకాలు విధించడం లేదు. అయితే అక్కడి నుండి దిగుమతి అవుతున్న అనేక మందులపై కేంద్రం 10 శాతం సుంకం వేస్తోంది. ఉదాహరణకు కొన్ని బ్లడ్ క్యాన్సర్ల చికిత్సకు వాడే టెస్టిస్టామాబ్ ఇంజక్షన్ వంటివి. అమెరికా నుండి ఏటా 800 మిలియన్ డాలర్ల విలువ కలిగిన ఫార్మా ఉత్పత్తులను భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఈ ఔషధాలపై సుంకం రూపంలో ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం యాభై మిలియన్ డాలర్ల లోపే ఉంటోంది. దీనికి భిన్నంగా 2023-24లో అమెరికాకు మన దేశం నుండి 9.7 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఔషధాలు, ఫార్మాస్యూటికల్ ఎగుమతులు జరిగాయి.

జనరిక్ ఎగుమతులే అధికం:

అమెరికాకు ఎగుమతి అవుతున్న ఔషధాలలో ఎక్కువ భాగం జనరిక్ మందులే. ఇవి చౌకగా లభిస్తాయి. జనరిక్ మందుల కోసమే అమెరికా ఎక్కువగా మన దేశంపై ఆధారపడుతోంది. ఒకవేళ అమెరికా కనుక ప్రతీకార సుంకాలు విధిస్తే చౌకగా మందులు తయారు చేస్తున్న భారతీయ ఫార్మా కంపెనీలు తీవ్రంగా నష్టపోతాయి. అంతేకాదు అమెరికా ఆరోగ్య వ్యవస్థపై కూడా బాగా ప్రభావం పడుతుంది. ఖర్చులు పెరిగి ద్రవ్యోల్బణానికి దారితీయవచ్చు. అమెరికా నుండి దిగుమతి అవుతున్న మందులపై భారత్ సుంకాన్ని రద్దు చేస్తే తమకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని, ఒత్తిడి తగ్గుతుందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. దేశంలోని 23 ప్రముఖ ఫార్మా కంపెనీలు ఐపీఏలో సభ్యులుగా ఉన్నాయి. ప్రపంచంలో జనరిక్ మందుల సరఫరా చేసే దేశాలలో భారత్‌దే అగ్రస్థానం. ప్రపంచ సరఫరాలలో మన వాటా 20 శాతంగా ఉంది. ప్రభుత్వ సమాచారం ప్రకారం 2023-24లో దేశం నుండి 27.85 బిలియన్ డాలర్ల విలువ కలిగిన ఫార్మా ఎగుమతులు జరిగాయి. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ప్రపంచంలోని సుమారు 200 దేశాలకు మందులు ఎగుమతి అవుతున్నాయి. కొన్ని భారతీయ ఫార్మా కంపెనీలు తమ ఔషధ ఉత్పత్తులలో యాభై శాతం వరకూ అమెరికాకే ఎగుమతి చేస్తున్నాయి. అంటే ఆ కంపెనీలకు అమెరికా ముఖ్యమైన మార్కెట్‌గా నిలుస్తోందన్న మాట. బెల్జియం, దక్షిణాఫ్రికా, బ్రిటన్, బ్రెజిల్ దేశాలకు కూడా భారత్ నుండి గణనీయ పరిమాణంలోనే మందులను దిగుమతి చేసుకుంటున్నాయి. మన దేశం నుండి అమెరికాకు సరఫరా అవుతున్న మందులలో 70-80 శాతం తక్కువ విలువ కలిగిన జనరిక్ మందులే. హైదరాబాద్‌కు చెందిన గ్రాన్యూల్స్ ఇండియా కంపెనీ తక్కువ ధరకు లభించే పారాసిటమాల్, ఇబూప్రోఫెన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులను సరఫరా చేస్తుంది. దీని వార్షిక సరఫరాలలో 65 శాతానికి పైగా అమెరికాకే జరుగుతుంటాయి. గ్లాండ్ ఫార్మా (54 శాతం), అరబిందో (48 శాతం), జైడస్ (4శాతం), డాక్టర్ రెడ్డీస్ (47 శాతం), సన్ ఫార్మా (32 శాతం) కూడా అధిక పరిమాణంలోనే అమెరికాకు మందులు ఎగుమతి చేస్తున్నాయి.

మూలిగే నక్కపై తాటికాయ పడితే ?: దేశంలోని సుమారు 300 కంపెనీలు అమెరికాకు మందులు ఎగుమతి చేస్తున్నాయి. ఒకవేళ అమెరికా ప్రతీకార చర్యలకు దిగితే ఈ కంపెనీల ఆర్థిక పరిస్థితి తలకిందులు అయ్యే అవకాశం ఉంది. జనరిక్ మందుల విక్రయం పై 10-15 శాతం మార్జిన్ మాత్రమే ఉంటుందని, అదనపు సుంకాలు విధిస్తే మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అవి మరింత తగ్గుతుందని ఉత్పత్తిదారులు ఆందోళన చెందుతున్నారు. మంచి లాభాలు తెచ్చి పెట్టే మందులు తయారు చేస్తున్న సన్ ఫార్మా, లుపిన్, సిప్లా వంటి కంపెనీలు కొంత మేర తట్టుకోగలుగుతాయి. ఎందుకంటే వాటి లాభాల మార్జిన్ 30-35 శాతం వరకూ ఉంటుంది.

అగ్రరాజ్యానికీ నష్టమే: ట్రంప్ ప్రతీకార చర్యలకు దిగితే మన దేశమే కాదు అమెరికా కూడా నష్టపోతుంది. ఎందుకంటే మన ఔషధ కంపెనీలు తక్కువ ధరకు, నాణ్యమైన మందులను అమెరికాకు ఎగుమతి చేస్తున్నాయి. అమెరికా రోగులు వాడుతున్న జనరిక్ మందులలో మన కంపెనీల వాటా 47 శాతంఅంటే మన జనరిక్ మందుల వినియోగంతో అమెరికా లో వైద్య ఖర్చులు బాగా తగ్గిపోతున్నాయి. 2022లో భారతీయ కంపెనీలు సరఫరా చేసిన మందుల కారణంగా అమెరికా ఆరోగ్య వ్యవస్థకు 219 బిలియన్ డాలర్లుఆదా అయ్యాయి. 2013-22 మధ్య కాలంలో అమెరికాకు ఒనగూడిన ఆర్థిక ప్రయోజనం 1.3 ట్రిలియన్ డాలర్లు. ముఖ్యంగా హైపర్‌టెన్షన్, డయాబెటిస్, మానసిక సమస్యలు,కాలేయం, నరాలు,అల్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న అమెరికన్లకు భారతీయ కంపెనీల మందులే దిక్కవుతున్నాయి.

# నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**పెద్దపల్లి, తెలంగాణ దిశ :** సెర్ఫ్ క్రింద నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీ.ఎన్.లోకేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీ.ఎన్.లోకేష్ కుమార్ సెర్ఫ్ కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి.దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీ.ఎన్.లోకేష్ కుమార్ మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33% ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదన లు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకేపి లకు బదిలీ చేయాలని, అదనపు వారిధాన్యందిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళ సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందిం చాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌ రసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమిషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీని పై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమిషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో గోదాముల నిర్మాణానికి సంకల్పించారని, ప్రస్తుతం ఏ మండలాల్లో గోడౌన్లు లేవు గుర్తించి అక్కడ మహిళా సంఘాల ద్వారా గోడౌన్ నిర్మించేందుకు గల అవకాశా లను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ , సెర్ఫ్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ నిర్వహించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. నూతన దరఖాస్తులలో రీన్యూవల్స్ కు ప్రాధాన్యతగా షెడ్యూల్ చేయాలని అన్నారు. నిర్ధారణ క్యాంపు ల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమై న సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్దులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ లకు సూచించారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. 3 నెలలు ఫించన్ తీసుకొని లబ్దిదారుల వలస వెళ్లినట్లు షిష్టం నమోదు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం మన దగ్గర 2 లక్షల 55 వేల 262 లబ్దిదారుల వలస వెళ్లినట్లు ఉందని, ఈ వివరాలను అధికారులు రివ్యూ చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాల ని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని , జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు. స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ క్రింద 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు రివ్యూ చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని




అన్నారు. స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్విచ్చింగ్ సెంటర్ లు పూర్తి స్థాయిలో వినియో గించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లౌజ్, పెటికోట్ కుట్టడం వంటి ఆర్డర్ తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు.

అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారుల కు తెలిపారు. మహిళల చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న చిన్న హెూటల్స్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. గ్రామీణ సెల్ఫ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కు అనువైన స్థలాల ఎంపిక చేయాలని,అనువైన స్థలం ఎంపిక చేసిన వెంటనే ఎన్.ఆర్.ఐ.టి నుంచి 50 లక్షల రూపాయల గ్రాంట్ వస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని, బజార్ ఎల్లప్పుడూ ప్రజలతో కిటకిటలాడేలా ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు 10 లక్షల ప్రమాద బీమా, 2 లక్షల సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్ధిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ నిర్వహించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు,

వారిలో ఎంత మందికి ప్రమాద బీమా, సాధారణ భీమా అమలు అవుతుంది పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అం దజేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలో సుల్తానాబా ద్, మంథని రహదారి వద్ద మహిళా సంఘాలచే పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే స్థల ఎంపిక చేసి సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిం చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్ సెటి ట్రైనింగ్ సెంటర్ త్వరగా ఏర్పాటు చేయాలని,లోన్ బీమా,ప్రమాద బీమా క్లెయిమ్స్ తొందరగా పంపించాలని తెలిపారు.

# వైద్య రంగంలో సరికొత్త చరిత్ర



### బ్రెయిన్ డెడ్ వ్యక్తికి పంది లివర్ మార్పిడి
### చైనా వైద్యుల సర్జరీ సక్సెస్
### అద్భుతంగా పని చేస్తున్న లివర్

వైద్యరంగ చరిత్రలోనే సరికొత్త అధ్యయం లిఖించారు చైనా డాక్టర్ల. లివర్ మార్పిడి ఆపరేషన్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసి.. మనిషికి పంది లివర్‌ను అమర్చారు. మరోవిశేషం ఏంటంటే.. మనిషికి అమర్చిన ఆలివర్ ఎంతో బాగా పనిచేస్తోంది. పంది లివర్‌ను మనిషికి పెట్టడం అనేది ప్రపంచంలోనే ఇదే తొలిసారి. గతంలో అమెరికాలో పంది గుండె, కిడ్నీలను మనుషులకు అమర్చారు కానీ, లివర్‌ను మార్పిడి చేయడం ఇదే ఫస్ట్ టైమ్‌ను. ఈ ఘనతను చైనా వైద్యులు సాధించారు.అయితే.. ఈ ప్రయోగాన్ని ఒక బ్రెయిన్ డెడ్ పేషెంట్‌పై చేశారు. అలాగే లివర్‌ను దానం చేసిన పంది సాధారణ పంది కాదు. దానిలో ముందుగానే జన్యుపరంగా కొన్ని మార్పులు చేశారు. ఆ తర్వాత దాని నుంచి లివర్ తీసి.. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి అమర్చారు. పది రోజుల పర్యవేక్షణ తర్వాత ఆ లివర్ బాగానే పనిచేస్తోంది అంటూ వైద్యులు ప్రకటించారు.చైనా లోని ఫోర్త్ మిలిటరీ మెడికల్ యూనివర్సిటీకి చెందిన కై-షాన్ టావో, జావో-జు యాంగ్, జువాన్ జాంగ్, హాంగ్-టావో జాంగ్ నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ ఆపరేషన్ చేశారు. "జీన్-మోడిఫైడ్ పిగ్-టు-హ్యూమన్ లివర్ జెనోట్రాన్స్ప్లాంటేషన్" అనే శీర్షికతో ఈ అధ్యయనం నేచర్ జర్నల్‌లో ప్రచురితమైంది. "ఈ అధ్యయనంలో కఠినమైన పర్యవేక్షణలో, మేము ఆరు జన్యువులు సవరించిన పంది నుండి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి కాలేయాన్ని జెనోట్రాన్స్ప్లాంట్ చేశాం" అని వైద్యులు ఆ జర్నల్‌లో పేర్కొన్నారు. అయితే ఈ శస్త్రచికిత్స అధికారికంగా మార్చి 10, 2024న జరిగింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యుల అంగీకారం తో వైద్యులు ఈ ఆపరేషన్ చేపట్టారు. ఆపరేషన్ పూర్తి అయిన తర్వాత ఓపది రోజుల పాటు మనిషిలో ఆ లివర్ ఎలా పనిచేస్తోంది,రక్తం ప్రవాహం,పిత్త ఉత్పత్తి, రోగనిరోధక ప్రతిస్పందన, ఇతర కీలక విధులను పర్యవేక్షించారు. కొన్ని సార్లు మనిషిశరీరం ఇలాంటి ఇతర జీవాల అవయవాలను తిరస్కరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం పంది లివర్ అద్భుతంగా పనిచేస్తోందని, పది రోజులు పర్యవేక్షణ తర్వాత వైద్యులు ధృవీకరించారు. అలాగే కీలకమైన ప్రోటీన్ అల్బుమిన్‌ను ఉత్పత్తి చేసిందని జియాన్ వైద్యులు వెల్లడించారు. ఈ ప్రయోగం ఎన్నో ఆశలు రేపుతోంది. వ్యాప్తంగా కాలేయ సమస్యతో బాధపడుతున్న వారికి ఇదిభారీ ఊరటను ఇచ్చే అంశమని వైద్యులు అంటున్నారు. లివర్ మార్పిడి ఆపరేషన్ కోసం ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ఎదురుచూస్తున్నారని,కానీ, వారికి దాతలు దొరకడం లేదని, ఒక వేళఈ ప్రయోగం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితే.. భవిష్యత్తులో జన్యుపరంగా కొన్ని మార్పులు చేసిన పంది లివర్‌ను మనుషులకు అమర్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు.

# ఎవరికి ఎర్త్... ఎవరికి బెర్త్..?

**హైదరాబాద్, తెలంగాణ దిశ :**తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఎప్పుడెప్పుడు మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ఆశావాహులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15నెలలు పూర్తయిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణకు సమ యం ఆసన్నమైంది. ఉగాది సందర్భంగా ఈ విస్తరణ జరిగే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ నివాసంలో కీలక సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు నేతలు హాజరైన ఈ భేటీలో మంత్రివర్గ విస్తరణపై చర్చలు జరిగాయి. పార్టీ అధిష్ఠానం ఈ విషయంలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఎవరికి కట్టబెట్టాలనే దానిపైనా అధిష్ఠానం ఓ అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

కొత్త మంత్రివర్గంలో రెండు బీసీ, ఒక రెడ్డి, ఒక ముస్లిం, ఒక ఎస్సీ సామాజిక వర్గాలకు అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. బీసీ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్లు వినిపిస్తుండగా, ఎస్సీ కోటాలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట్ స్వామి పేరు ప్రము ఖంగఉంది రెడ్డికోటాలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాగోపాల్ రెడ్డి,బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మధ్య పోటీ నెలకొం ది.మైనారిటీ కోటాలో ఎమ్మెల్సీ మీర్ అమీర్ అలీఖాన్‌కు అవకాశం ఉండగా, ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయ శాంతి పేరు కూడా చర్చలో ఉంది.అయితే, ప్రస్తుత మంత్రివర్గంలోని ఇద్దరు మంత్రులను తొలగించే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ఊహాగానాలు సాగుతున్నాయి. మంత్రి కొండా సురేఖ,జూపల్లి కృష్ణా రావును తప్పించే సూచనలు కనిపిస్తున్నాయి. వరుస వివాదాల్లో చిక్కుకున్న కొండా సురేఖ పదవి కోల్పోతారనే చర్చ పార్టీ వర్గాల్లోనూ జరుగుతోంది. కొత్త మంత్రివర్గ జాబితా మరో రెండు రోజుల్లో బయటపడే అవకాశం ఉంది. ఈ విస్తరణతో రేవంత్ రెడ్డి టీమ్‌లో కొత్త ఊపు వస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ఆశిస్తున్నాయి.

నలుగురికి అవకాశం: తెలంగాణలో కేబినెట్ విస్తరణకు సమయం ఆసన్నమైంది. ఈమేరకు కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక చొరవ చూపుతోంది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ అగ్రనేతలైన రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే,మీనాక్షి నటరాజన్, కేసీ వేణుగోపాల్‌లతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశంలో క్యాబినెట్‌లో నలుగురు కొత్త మంత్రులను చేర్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ఈ నిర్ణయం ఉందని తెలుస్తోంది.కొత్తగా మంత్రులుగా చేరనున్న వారిలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి. వివేక్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం.

ఈ నలుగురూ విభిన్న సామాజిక వర్గాల నుంచి వచ్చినవారు కావడం గమనార్హం. వాకిటి శ్రీహరి ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తూ బీసీలకు ప్రాధాన్యతనిచ్చే కాంగ్రెస్ విధానాన్ని ప్రతిబింబిస్తారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రోడ్లు?భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడిగా, పార్టీలో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. జి. వివేక్, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతగా, పార్టీకి కొత్త ఊపు తెచ్చే అవకాశం ఉంది. సుదర్శన్ రెడ్డి నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ప్రాంతీయ సమతుల్యతను సాధించేందుకు ఎంపికయ్యారు. గరిష్టంగా 18 మంది వరకు ఉండే అవకాశం ఉంది. ఈవిస్తరణతో ఆరు ఖాళీల్లో నాలుగు భర్తీ కానున్నాయి. ఈ చర్చల్లో ప్రాంతీయ, సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, గత ఎన్నికల్లో బీసీఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ విస్తరణతో పార్టీలో అసంతృప్తిని తగ్గించి, ప్రభుత్వ పనితీరును మరింత బలోపేతం చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.ఈనిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఒరవడిని సృష్టించనుంది. కొత్త మంత్రుల ఎంపికతో ప్రభుత్వంలో సమతుల్యత, సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించనున్నాయి.

# తమ్ముళ్ల వాయిస్ ఏది?

**విజయవాడ, తెలంగాణ దిశ :**లుగుదేశం పార్టీలో సీనియర్ నేతలు యాక్టివ్ గా లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అధికారంలో లేనప్పుడే నయం. అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన సీనియర్ నేతలు గత ఎన్నికల్లో టిక్కెట్లు రాక కొందరు,మంత్రి పదవులు దక్కక మరికొందరు మూగవోయారు. అందరూ జూనియర్ నేతలు కావడంతో ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకు సరిగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. కొందరు తమకేం పట్టిందని వ్యవహరిస్తుండగా, మరికొందరు ఏం మాట్లాడితే ఏం జరుగుతందోనన్న భయంతో జూనియర్ నేతలు గళం విప్పడం లేదు. దీంతో టీడీపీ నేతల నుంచి గట్టి కౌంటర్ ఇవ్వడం లేదన్న విమర్శలు ఆపార్టీ క్యాడర్ నుంచే వినిపిస్తుండటం విశేషం. రాజకీయాల్లో అనుభవం చాలా ముఖ్యం. ఎవరికి ఏ రకమైన సమాధానం చెప్పాలన్న ది డక్కీమొక్కీలు తిన్న నేతలకు మాత్రమే తెలుస్తుంది. కొత్తగా తొలిసారి ఎన్నికయిన వారిలో కొందరు మినహాయించి మిగిలిన వారిలో పార్టీ తరుపున కౌంటర్ ఇవ్వాలన్న స్పృహ కూడా లేదని టీడీపీ సోషల్ మీడియాలో సొంత క్యాడర్ నుంచి విమర్శలువినిపిస్తున్నాయి. ఉండటానికి ఇరవై మందికిపైగా మంత్రులున్నప్పటికీ ఘాటుగా రిప్లై ఇచ్చేవారు ఒకరిద్దరు మినహాయించి ఎవరూ మాట్లాడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు చిలకలూరిపేటమాజీ ఎమ్మెల్యే విడదల రజనీపై కేసు నమోదు చేసిన సంఘటనపై ఆమె అనేక ఆరోపణలు చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగమని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుపై కూడా విమర్శలు చేశారు కానీ టీడీపీ నుంచి ఒక్క మంత్రి కూడా దీనిపై స్పందించలేదు.

రజనీ చేసిన తప్పులను ఎండగట్టే ప్రయత్నం చేయలేదు. చివరకు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు నేరుగా రంగంలోకి దిగి తాను కౌంటర్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్తిపాటి పుల్లారావు స్పందించినప్పటికీ దానికి అంతగా ప్రాచుర్యం లభించలేదు. మంత్రులు ఇంత మంది ఉండి ఏం చేస్తున్నారన్న ప్రశ్నను తెలుగు తమ్ముళ్లు లేవనెత్తుతున్నారు. ఏసీబీ కేసు నమోదు చేయడంతో పాటు ఐపీఎస్ అధికారి చేసిన ఫిర్యాదు ఉన్నప్పటికీ ధీటుగా బదులివ్వలేని పరిస్థితి అమాత్యులకు ఎందుకు ఉందని నిలదీస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రతిపక్ష విమర్శలను ప్రజలు నమ్మే అవకాశముందన్న హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి... దీంతో పాటు వైసీపీ నేతలు సూపర్ సిక్స్ పై విపరీతమైన నెగిటివ్ ప్రచారాన్ని ప్రారంభించారు.

# స్వరూపానందకు రోజులు గడువు..!

**విశాఖపట్టణం, తెలంగాణ దిశ :** విశాఖ శ్రీ శారదా పీఠం వ్యవహారం ఎంతవరకు వచ్చింది? కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరూపానంద స్వామి కనిపించడం మానేశారా? స్వామి కబ్జాల వ్యవహారం బయటకు వస్తోందా? బయటకు రావడం కంటే సైలెంట్‌గా ఉండడమే బెటరని అంచనాకు వచ్చారా? మరి జీవీఎంసీ నోటీసులకు స్పందన లేకుంటే కూల్చివేతలు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ రూలింగ్‌లో రాజభోగం అనుభవించిన వారిలో శ్రీ శారదా పీఠం స్వరూపానంద స్వామి ఒకరు. భక్తుల మాట కాసేపు పక్కనబెడితే ఆయన ఆశీర్వాదం కోసం రాజకీయ నేతలు, అధికారులు తెగ తిరిగేవారు. అయినా స్వామి జగన్, కొందరు మంత్రులకు మాత్రమే కనిపించేవారు. ఆ తర్వాత ప్రత్యేకంగా కొందరితో మాత్రమే మాట్లాడేవారు.వైసీపీ పాలనలో వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను ఆక్రమించుకున్నారని స్వామిపై ఆరోపణలు లేకపోలేదు. దీనికితోడు స్వామికి ప్రత్యేకంగా భద్రత సైతం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బాగా పరిపాలన చేస్తారంటూ రెండు ముక్కలు మాట్లాడారు. ధనుర్మాసం పూజలంటూ బయటకు వెళ్తానన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో సెటిలవుతానని చెప్పుకొచ్చారు.చివరకు స్వామి పత్తా లేకుండా పోయారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలీదు. స్వామి కోసం చాలామంది భక్తులు ఎదురు చూస్తున్నారు. స్వామి ఆశీర్వాదం తీసుకుంటే మంచి జరుగుతుందని కొందరు నమ్ముతారు. కూటమి వచ్చాక ఆయన భద్రతను పూర్తిగా తొలగించింది. విశాఖ శ్రీ శారదా పీఠానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. అందులో శాశ్వత కట్టడాలు నిర్మించారు. వాటిని వారంలోగా తొలగించాలని నోటీసులో ప్రస్తావించారు అధికారులు. లేకుంటే తామే కూల్చివేస్తామని మఠం మేనేజర్‌కి వాటిని అందజేశారు.తొలగింపుకు అయ్యే ఖర్చు శారదాపీఠం నుంచే వసూలు చేస్తామన్నారు. చిన ముషిడివాడలో శ్రీశారదా పీఠం ఉంది. అందులో దాదాపు 22 సెంట్ల భూమి ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 203 చదరపు గజాల స్వయం జ్యోతి మండపం ఉంది. 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లో వుడా లేఅవుట్‌కి సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది.

# బీఆర్ఎస్‌లో ఏం జరుగుతోంది..?




**మెదక్, తెలంగాణ దిశ :** మొన్నటివరకు ఆ నియోజకవర్గం గులాబీ పార్టీలో అంతా ఆయనే చూసుకున్నారు. ఇప్పుడు ఆయన్ని కాదని కొత్త ముఖాన్ని తెరపైకి తెచ్చారు. దాంతో ఆ నియోజకవర్గంలో ఒక్కసారిగా గ్రూపు రాజకీయాలకు తెరలేచింది. మొన్నటివరకు సైలెంట్ గా ఉన్నవారు ఇప్పుడు వైలెంట్‌గా మారి సీనియర్ నేతను టార్గెట్ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం. 2014లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన పట్లోళ్ల కిష్టారెడ్డి ఆకస్మిక మరణం తర్వాత 2016లో ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భూపాల్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. దాంతో మొదటిసారి నారాయణఖేడ్ లో బీఆర్ఎస్ జెండా ఎగిరింది. ఆ తర్వాత 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ రెండోసారి బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించింది. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండటం ఎమ్మెల్యే కూడా అదే పార్టీ కావడంతో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అభివృద్ధి బాగానే జరిగింది.అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకి వచ్చేసరికి ఎమ్మెల్యేపై స్థానికంగా వ్యతిరేకత పెరిగింది. సొంత పార్టీ నేతలు, కార్యకర్తల నుంచే అసమ్మతి పెరగడంతో అధిష్టానం నష్టనివారణ చర్యలు చేపట్టింది. అయినా కూడా కారు పార్టీ పరాజయం పాలైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి దివంగత ఎమ్మెల్యే కిష్టారెడ్డి కుమారుడు పటోళ్ల సంజీవరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడమే కారణమన్న ప్రచారం అప్పట్లో జరిగింది. బీఆర్ఎస్ నుంచి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు భూపాల్ రెడ్డిపై కోపంతో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరికొంతమంది భూపాల్‌రెడ్డిపై వ్యతిరేకత ఉన్నా పార్టీనే నమ్ముకుని సైలెంట్ గా ఉండిపోయారు. అయితే పార్టీలో మాజీ ఎమ్మెల్యేపై ఉన్న అసంతృప్తి ఇప్పటివరకు ఎక్కడ బయటపడలేదు.కానీ ఒక్కసారిగా ఇప్పుడు పార్టీలో ఉన్న అసమ్మతి తెరపైకి వచ్చింది. రైతు భరోసాపై రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ అన్ని మండల కేంద్రాల్లో నిరసనలకు పిలుపునిచ్చింది. నారాయణఖేడ్ లో బీఆర్ఎస్ ఆందోళన చేయగా ఒకటే పార్టీ జెండా వేసుకుని రెండు గ్రూపులు వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే వర్గం ధర్నా చేసి వెళ్లిపోయాక.. మరో వర్గం బీఆర్ఎస్ కండువాలు వేసుకుని ధర్నా చేసి మాజీ ఎమ్మెల్యే వర్గానికి షాక్ ఇచ్చింది. మాజీ ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఉన్న వాళ్లు ఆ ధర్నా చేశారట. ఈ ధర్నాని పార్టీతో సంబంధం లేని మచ్చేందర్ అనే ఓ నాయకుడు చేయించారన్న ప్రచారం జరుగుతుంది. భూపాల్ రెడ్డి పక్కకు పెట్టిన వారితో గ్యాంగ్ ఏర్పాటు చేసుకుని తాను కూడా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్టు మచ్చేందర్ ప్రచారం చేసుకుంటున్నారు. దానిపై మాజీ ఎమ్మెల్యే వర్గం మాత్రం పార్టీలో ఫేడ్ అవుట్ అయిన వాళ్లు, జనాదరణ లేని కొందరు ఇలా పార్టీని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని అంటుంది. ఏది ఏమైనా ఒక్కసారిగా బీఆర్ఎస్ రెండు వర్గాలుగా విడిపోవడంతో పార్టీకి నష్టం జరిగే అవకాశముందని క్యాడర్ కలవరం చెందుతోంది. బీఆర్ఎస్ అగ్రనేతలు వెంటనే వర్గపోరుకి ఫుల్ స్టాప్ పెట్టాలని.. గోటితో పోయేదాన్ని గొడ్డలి వరకు తెచ్చుకుంటే మాత్రం పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారే అవకాశముందని కేడర్ సూచిస్తోంది.

# అప్పుల ఊబిలో.. నేతన్నలు..!



**హైదరాబాద్, తెలంగాణ దిశ :** తెలంగాణలో నేతన్నలు అప్పుల ఊబిలో చిక్కుకున్నారు. ఆర్థిక సమస్యలతో ఎంతోమంది తనువు చాలిస్తున్నారు. అటు ఆశించిన స్థాయిలో రాబడి లేదు. ఈ నేపథ్యంలో.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నేతన్నలకు ఆర్థికంగా అండగా నిలవాలని నిర్ణయించింది. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో నేతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు సీఎం ఆదేశాలతో అధికారులు కదిలారు. చేనేత శాఖ రుణమాఫీపై కసరత్తు చేపట్టిందిరుణమాఫీ అమలుకు రూ.58 కోట్లు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు చేనేత శాఖ ప్రతిపాదనలు రూపొందించి నిధుల విడుదల కోసం ఆర్థికశాఖకు దస్త్రం పంపింది.గత ప్రభుత్వం 2017 మార్చి 31 వరకు రుణమాఫీ అమలు చేసింది. దీంతో 2017 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు ఉన్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణలోని బ్యాంకులు, చేనేత కార్మికులు, సంఘాలు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల సమాచారాన్ని.. జిల్లాల నుంచి ప్రభుత్వం సేకరించింది.ఆ వివరాల ప్రకారం.. 7,250 మంది కార్మికులకు రూ. 40.10 కోట్ల వ్యక్తిగత రుణాలు, 91 చేనేత సహకార సంఘాలపై రూ. 18 కోట్ల మేరకు అప్పులున్నట్లు తేలింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో.. రుణ మాఫీకి రూ.58.10 కోట్లు అవసరమని చేనేత శాఖ ప్రతిపాదనలు పంపింది. కార్మికులు, సంఘాల వారీగా రుణ జాబితాను ఆర్థికశాఖకు అందజేసింది.ఆర్థిక శాఖ నుంచి ఆమోదం లభిస్తే.. రుణమాఫీ ప్రక్రియను చేపట్టేందుకు చేనేత శాఖ సిద్ధంగా ఉంది.చేనేత రుణమాఫీ కార్యక్రమాన్ని కార్మికులతో భారీఎత్తున నిర్వహించాలని రేవంత్ సర్కారు భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆ కార్యక్రమంలోనే రేవంత్ రుణ మాఫీ నిధులను విడుదల చేస్తారని సమాచారం.తెలంగాణలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది చేనేత రంగంలో జీవనోపాధి పొందుతున్నారని.. అధికారులు చెబుతున్నారు. వస్త్రాల తయారీలో వస్తున్న అధునాతన సాంకేతిక మార్పుల కారణంగా.. చేనేత రంగంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో నూతన డిజైన్లు, వైవిధ్యతతో వస్త్రాల తయారీలో ముందుకెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్నకు చేయూత ద్వారా.. చేనేత కార్మికుడు పొదుపు చేసుకున్న డబ్బుకు రెండింతలు ప్రభుత్వం వాటాగా వారి అకౌంట్లో జమచేస్తోందని అధికారులు వివరిస్తున్నారు.

# పార్టీలు మారడం కాదు.. విధానాలు మారాలి : సిహెచ్




**విజయవాడ, తెలంగాణ దిశ :**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) విజయవాడ పశ్చిమ సిటీ 23వ మహాసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నెహ్రూ బొమ్మ సెంటర్ నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిపిఎం కార్యకర్తలు, ప్రజలు, వివిధ వర్గాల కార్మికులు పాల్గొన్నారు. మోటూరు హనుమంతరావు శ్రామిక భవన్ వద్ద నిర్వహించిన బహిరంగ సభకు సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. పెరిగిన విద్యుత్ భారాలను తగ్గించాలని, అర్హులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, కొండ ప్రాంత ఇళ్లకు పట్టాలు, రిజిస్ట్రేషన్లు చేయాలని, డిగ్రీ కాలేజీ సాధనకు, షేక్ రాజా హాస్పిటల్ ను 100 పడకల హాస్పిటల్ గా మార్చాలని వీటిపై ఇప్పటికే సిపిఎం పోరాటం చేస్తుందని తెలిపారు. మరింత బలంగా ఈ పోరాటాలు జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. మోడీ ప్రభుత్వం, బిజెపి, టిడిపి, జనసేనలు ఆంధ్రప్రదేశ్ ను అదానికి అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని, అందుకే రానున్నది ఉద్యమ కాలమని అన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం, వామపక్షాలను బలపర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ %ొ% అదాని ముడుపుల కేసుపై మోడీ, చంద్రబాబు, పవన్ మాట్లాడటం లేదని అన్నారు. అవినీతిని అంతం చేస్తామని ప్రచారం చేస్తున్న వీరు అదాని, జగన్ లను ఈ కేసులో ఎందుకు విచారణ జరపడం లేదని మండిపడ్డారు. పార్టీలు, నాయకులు, జెండాలు మారడం కాదని విధానాలు మారాలని తెలిపారు. ప్రత్యామ్నాయ విధానాలు సిపిఎం, వామపక్షాలు ప్రజలకు మేలు చేస్తాయని తెలిపారు. మతోన్మాద ఎజెండాతో విధానాలు దేశానికి నష్టం చేస్తున్నాయని, మణిపూర్ అల్లర్లపై ఇప్పటికీ కేంద్ర బిజెపి, నేటి కూటమి ప్రభుత్వం కానీ, నాటి వైసిపి ప్రభుత్వం కానీ నోరు మెదపలేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వైసిపి వదిలిన చెప్పుల్లో కూటమి ప్రభుత్వం కాలు పెట్టి నడుస్తుందని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఉపయోగపడే దుర్గా కో ఆపరేటివ్ బ్యాంకును మూసేస్తే ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధులు మాట్లాడలేదని మండిపడ్డారు. పెన్షన్లు పింఛన్లను రద్దు చేస్తే సిపిఎం పోరాటం చేస్తుందని హెచ్చరించారు. మంచి మందు కాదు%ొ% మంచి నాణ్యమైన రేషన్ సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే నాసికం బియ్యం స్థానంలో నాణ్యమైన బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# చెత్తపన్ను వేసినా..చెత్త తొలగించలే

**విద్యుత్ ప్లాంట్ల నిర్లక్ష్యంతో తగ్గిన ఉత్పత్తి**

**జిందాల్ ప్లాంట్‌ను పరిశీలించిన మంత్రి నారాయణ**



**పల్నాడు, తెలంగాణ దిశ :** గత ప్రభుత్వం చెత్తపన్ను వేసినా, చెత్తను తొలగించలేదని, చెత్త రీసైక్లింగ్ చేపట్టలేదని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌లను వదిలేసిందని మంత్రి నారాయణ అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 మధ్య చాలా స్టడీ చేసిన తర్వాత వేస్ట్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసే ఎ లాంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఏడు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ నుంచి చెత్తను ఈ ఎ÷-లాంట్‌కు తరలిస్తున్నారని తెలిపారు. మంగళవారం జీఎంసీ పరిధిలోని జిందాల్ ప్రాజెక్టును మంత్రి నారాయణ పరిశీలించారు. మంత్రి నారాయణతో పాటు ప్రాజెక్టును ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు , స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాబి పరిశీలించారు. మంత్రి నారాయణకు జిందాల్ పవర్ ప్లాంట్ పనులను అధికారులు వివరించారు.ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. '201419 మధ్య చాలా అధ్యయనం తర్వాత ప్లాంట్ నిర్ధయించాం. వైకాపా ప్రభుత్వం విద్యుదుత్పత్తి ప్లాంట్‌లను వదిలేసింది. 7 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ నుంచి చెత్తను ఎ÷-లాంట్‌కు తరలిస్తున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2,500 టన్నులను విద్యుత్‌గా మారుస్తున్నారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ఎ÷-లాంట్ ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం ఒక్క ఎ÷-లాంట్ కూడా ఏర్పాటు చేయలేదు. చెత్త పన్ను తప్ప.. చెత్తను ఎలా నిర్వహించాలో గత ప్రభుత్వానికి తెలియదు. చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించాం' అని మంత్రి అన్నారు. 16 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నిర్మించినట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్‌తో ప్రజలకు ఎంతో మేలని పేర్కొన్నారు. ఎ÷-లాంట్ ఏర్పాటులో చంద్రబాబు, నారాయణ కృషి ఎంతో ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి అన్నారు. విదేశీ సాంకేతికతను పరిశీలించాకే నారాయణ ఈ ప్లాంట్ నిర్మాణం చేయించారని చెప్పారు. ప్లాంట్ నిర్వహణ, ఇతర వివరాలు అడిగి మంత్రి నారాయణ తెలుసుకున్నారు. 6890 మెట్రిక్ టన్నుల చెత్తలో 2500 టన్నుల చెత్తను రెండు ఎ÷-లాంట్స్ ద్వారా విద్యుత్‌గా మారుస్తున్నారని తెలిపారు. కాకినాడ, నెల్లూరులో త్వరలో ఎ÷-లాంట్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. జగన్ ప్రభుత్వం ఒక్క ఎ÷-లాంట్‌ను కూడా ఏర్పాటు చేయలేదని చెప్పారు. చెత్త పన్ను వేయడం తప్ప చెత్తను ఎలా ఉపయోగించుకోవాలలో వైసీపీ ప్రభుత్వానికి తెలియదని అన్నారు. చెత్త పన్ను తీసేశాం.. చట్ట సవరణ చేసి మరీ చెత్త పన్ను తొలగించామని చెప్పారు. అమృత్ పథకానికి వైసీపీ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో పథకం కింద ఇచ్చే నిధులు ఉపయోగించలేకపోయామని అన్నారు. టన్ను చెత్తను ట్రీట్ చేయాలంటే రూ.500 నుంచి రూ.750లు ఖర్చవుతుందని.. ఆ ఖర్చు తగ్గించాలంటే చెత్త తరలించడమే మార్గమని మంత్రి నారాయణ అన్నారు. జిందాల్ ప్లాంట్ ఏర్పాటులో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ కృషి ఎంతో ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ తెలిపారు. విదేశాల్లో ఉన్న సాంకేతికను పరిశీలించిన తర్వాత నారాయణ జిందాల్ ఎలాంట్ నిర్మాణం చేయించారని అన్నారు. చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ ప్లాంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇటువంటి ప్లాంట్లులు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉన్నామని అన్నారు. జగన్ ప్రభుత్వం 85 వేల టన్నుల చెత్తను ప్రజల నెత్తిన వేసి వెళ్లిందని చెప్పారు. ఏపీని ఘన వ్యర్థాల ట్రీట్‌మెంట్‌లో ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతామని కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో జిందాల్ ప్లాంట్ నిర్మాణం చేశారని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వేస్ట్ నుంచి విద్యుత్ తయారు చేసే ఎ÷-లాంట్‌తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. వేస్ట్ ఎక్కడిక్కడ పేరుకుపోకుండా చర్యలు చేపట్టినట్లు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

# నేత్రదాత దేవి చంద్రయ్య సభ



**కమాన్ పూర్, తెలంగాణ దిశ :**పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నేత్రదాత దేవి చంద్రయ్య సంస్మరణ సభ జరిగింది ఈ సభ లో కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్ మేమెంటో ప్రధానం చేసి వారిని ఘనంగా సత్కరించారు.... సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ లింగమూర్తి మాట్లాడుతూ దేవి చంద్రయ్య చిరస్మరణీయుడని. అతని కళ్ళు ఇద్దరికీ చూపునిచ్చాయని వారి కుటుంబ సభ్యులు ఎంతో గొప్ప మనసుతో కళ్ళనుదానం చేశారని అన్నారు... ఈ దేశంలో ఎంతోమంది చూపులేని వారు ఉన్నారని అలాగే అవయవ దానం కూడా చేయాలని పిలుపునిచ్చారు.. డాక్టర్లకు పరీక్షల నిమిత్తం చనిపోయిన వారి కళ్ళ ఉపయోగపడతా యని లేదా ఇంకెవరికైనా చూపునిస్తాయని నేత్రదానం చేపించాలని కోరారు... లయన్స్ క్లబ్ అధ్యక్షులు సాన రామకృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యులను ఘనంగా శాలువాలతో సత్కరించి గొప్ప కార్యక్రమానికి సహకరించిన కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.. ఈ కార్యక్రమంలో సదాశియ ఫౌండేషన్ జిల్లా సలహాదారులు.. మాల మహానాడు ఆఫ్ ఇండియా పెద్దపెల్లిజిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవీ లక్ష్మీనరసయ్య... కన్నాల మాజీ ఎంపీటీసీ దేవి స్రవంతి.. చింతకింది కనకయ్య. కాసర్ల రాజేశ్వరి. కుటుంబ సభ్యులు రమాదేవి. సింధు. దేవి శ్రీనివాస్. లావణ్య. దేవి వినీత్. మౌనిక.. తదితరులు పాల్గొని దేవి చంద్రయ్య కు నివాళులర్పించి దేవి చంద్రయ్య జోహార్లు అమర్ రహే అని నినదించారు...

# కొత్త ఎత్తులతో పాకిస్తాన్..

## బలగాల అదుపులో 10 మంది

శ్రీనగర్: నిరంతరం భారత్‌పై కుట్రలు చేస్తూ.. ఉగ్రవాదాన్ని ఎగదోస్తోన్న దాయాది మరో కొత్త పన్నాగానికి తెరతీసింది. భారత్ జైళ్లలోని కరుడుగట్టిన ఉగ్రవాదులతో సంప్రదింపులు, వారికి కీలక సమాచారాన్ని చేరవేసేందుకు ఆ దేశ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. డ్రగ్స్ బానిసలుగా లేదా మానసిక స్థితి సరిగ్గాలేని వ్యక్తుల్లా నటిస్తూ ఐఎస్ఐ ఏజెంట్లు కొందరు దేశంలోకి చొరబడుతున్నట్టు తెలుస్తోంది. గత జులై నుంచి దాదాపు పది మంది పాకిస్థానీలు పీవోకే నుంచి భారత్‌లోని ప్రవేశించినట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దులు దాటి ప్రవేశించిన వీరు ప్రస్తుతం జమ్మూ, పంజాబ్, రాజస్థాన్‌లలోని జైళ్లలో ఉన్నట్లు చెప్పారు. వీరి చొరబాటు వెనుక భారీ ఎజెండానే ఉందని తెలిపారు.దేశంలోకి చొరబడిన పాక్ పౌరులను ఐఎస్ఐ ఏజెంట్లుగా భద్రతా దళాలు అనుమానిస్తున్నాయి. భారత్ జైళ్లలో ఉన్న పాక్ ఖైదీలకు కీలక సమాచారం చేరవేయడానికి వీరిని కొరియర్లుగా ఐఎస్ఐ వాడుకున్నట్టు సమాచారం. భద్రతా బలగాల ప్రశ్నలకు దీటుగా సమాధానమిచ్చి తప్పించుకునే పద్ధతుల్లోనూ వీరు శిక్షణ పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని అధికారులు అంటున్నారు. వారి అనుమానాస్పద తీరు, తప్పించుకునే ధోరణి చూస్తే చొరబాటు వెనుక భారీ కుట్రకోణం ఉన్నట్లు అర్థమవుతోందని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగిస్తే వారి కుట్రలు బయటపడుతాయన్న ఆలోచనతోనే ఐఎస్ఐ కొత్త మార్గాలను అనుసరిస్తోందని చెప్పారు.ఈ వ్యూహంలో మహిళలు, మైనర్లను సైతం ఐఎస్ఐ ఉపయోగించుకుంటున్నట్లు సమాచారం. డ్రగ్స్ అక్రమ రవాణాకు సైతం వీరిని పాకిస్థాన్ వాడుకుంటోన్నట్టు బావిస్తున్నారు. ఇటీవల పంజాబ్ సరిహద్దులో పట్టుబడిన ఓ మైనర్‌ను పాకిస్థాన్ బాలుడిగా గుర్తించారు. అతడు ఉద్దేశపూర్వకంగానే దేశం దాటినట్లు తెలుస్తోంది. అలాగే, రాజస్థాన్‌లో ఇటీవల భద్రతా బలగాలకు చిక్కిన ఓ పాకిస్థానీ మతిస్థిమితం లేనట్లు కనిపించాడు.

కానీ, అనుమానం వచ్చి.. తమదైన శైలిలో విచారించడంతో అసలు నిజం బయటపడింది. పాక్‌లోని ఇద్దరు డ్రగ్స్ స్మగ్లర్లు తనను ఏజెంట్‌గా పెట్టుకున్నట్టు వెల్లడించాడు.భారత్‌లోకి డ్రగ్స్ సరఫరాతో పాటు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు (బీఎస్ఎఫ్) సంబంధించి కీలక సమాచారం కూడా అతడు సేకరిస్తున్నట్టు తేలింది. అలాగే, లాహోర్‌కు చెందిన మహమ్మద్ అసద్ అనే యువకుడు బైక్‌పై వచ్చి బోర్డర్ దాటేందుకు ప్రయత్నించి.. ఉద్దేశపూర్వకంగానే బీఎస్ఎఫ్ సిబ్బంది చేతిలో అరెస్టు అయ్యేందుకు వేచి చూసినట్లు తెలిసింది. విచారణలో అతడు ప్రియురాలి విషయంలో కుటుంబంతో గొడవపడి వచ్చినట్టు చెప్పాడు. అయితే, అతడి తీరు అనుమానాస్పందంగా ఉండటంతో అదుపులోకి తీసుకుని జైలుకు తరలించారు. అయితే, అతడి కదలికలపై నిఘా పెట్టగా ఐఎస్ఐ కొరియర్‌గానే అనుమానం కలుగుతోందని అధికారులు తెలిపారు. తదుపరి విచారణ కోసం కస్టడీని పొడిగించాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

అక్టోబరులో షాహిద్ ఇమ్రాన్ (31) మరో పాక్ జాతీయుడు జమ్మూ సెక్టార్‌లో చొరబాటుకు ప్రయత్నించాడు. తాను కాళీ మాత ఆలయాన్ని దర్శించుకోడానికి వచ్చినట్టు చెప్పాడు.అనేక మార్గాల ద్వారా భారత్‌లో కోవర్టు ఆపరేషన్ల కోసం దాయాది ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 1990, 2000ల దశకాల్లో ఇరు దేశాల మధ్య నడిచే సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ను

ఆధారంగా చేసుకొని ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడేది. సవారీ ఆపరేటర్ల పేరుతో డ్రగ్స్ స్మగ్లింగ్, జమ్మూ,

పంజాబ్‌లలో ఉగ్ర కార్యకలాపాలకు నిధులు సమకూర్చడంలో వారే కీలక పాత్ర పోషించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

## దళారీ వ్యవస్థకు 'ఐరిస్'తో అడ్డుకట్ట

**కొత్తగూడెం, తెలంగాణ దిశ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దళారీ వ్యవస్థను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మొదటిసారి ఐరిస్ విధానాన్ని ఉపయోగించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు. గతంలో ఆధార్ నంబర్, సంబంధిత రైతు సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ధాన్యం కొనేవారు. తాజాగా ఓటీపీతో పాటుఐరిస్ (కనుపాపల స్కానింగ్) విధానం అమలు ద్వారా అక్రమాలకు ఆస్కారం ఉండబోదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. గతంలోరైతుల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాను నమోదుచేస్తే వారి సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దానిద్వారా ధాన్యం కొనేవారు. ఈక్రమంలో రైతుల పేరిట వ్యాపారులు, దళారులు ధాన్యం విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ధాన్యాన్ని తీసుకొచ్చి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకున్న ఘటనలు ఉన్నాయంటున్నారు. ఐరిస్ విధానాన్ని అమలుచేయటం ద్వారా ధాన్యం విక్రయించే రైతులు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలకు రావాల్సి ఉంటుంది.

# అమెరికా సుంకాల వేటు.. మోడీ సర్కారు లొంగుబాటు..?

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ఎన్నిక తర్వాత అమెరికా కాంగ్రెస్ సమావేశాలలో చేసిన ప్రథమ ప్రసంగంలో సుంకాల విధింపు గురించి హెచ్చరిక చేశారు. ఆయన ఉద్దేశంలో అమెరికా వాణిజ్య విధానాలను అవకాశంగా తీసుకుని లాభపడుతున్నాయ నుకుంటున్న దేశాలకు ఈ బెదిరింపు వర్తిస్తుందన్నారు. ఆయన జాబితాలో కెనడా, మెక్సికో, చైనా, బ్రెజిల్ ఇతర యూరోపియన్ దేశాలతో పాటు ఇండియా కూడా వుంది. అమెరికా ఉత్పత్తులపై దారుణంగా సుంకాలు విధిస్తున్న దేశాలలో ఇండియా ఒకటని ఇటీవల కాలంలో ట్రంప్ పదే పదే పేరెత్తి చూపించారు. 'ఇండియా సుంకాల సామ్రాట్' అని కూడా ఆయన పేరు పెట్టారు. ఏప్రిల్ 2 నుంచి తాను దెబ్బకు దెబ్బ తరహా సుంకాలు విధిస్తానని బెదిరింపు జారీ చేశారు. కెనడా నుంచి వచ్చే ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై దాంతోపాటే మెక్సికో, చైనాల నుంచి వచ్చే వివిధ రకాల సరుకులపైనా అమెరికా అదనంగా 25 శాతం సుంకం ప్రకటించింది. ఈ ప్రభావానికి గురైన ఆ దేశాలు ఇందుకు తీవ్ర ప్రతికూలత చూపించాయి. ఎందుకంటే అంతకు ముందు కాలంలో అమెరికాతో కుదుర్చుకున్న ఒప్పందాలకూ ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) నిబంధనలకు కూడా అమెరికా చర్య వ్యతిరేకంగా వుంది. కనుకనే మెక్సికో,చైనా, అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలు విధించాయి. కెనడా కూడా అదే ఆలోచన వున్నట్టు ప్రకటించింది. అయితే ఇండియా మాత్రం ఈ దేశాల వలె గాక పిరికితనం చూపించింది. అమెరికా ఉత్పత్తులపె సుంకాలు గణనీయంగా తగ్గించడానికి ఇండియా ఒప్పుకుందని అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకుంటున్నా భారత ప్రభుత్వం ప్రతిస్పందించకుండా వుండిపోయింది. భారత వాణిజ్య ఒప్పందాలలో సుంకాల సరళీకరణ ఒక భాగంగా వుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. దౌత్యపరమైన పరిభాషను పక్కనపెట్టి చూస్తే దీని సారాంశం ఒకటే. అమెరికా ఒత్తిడికి ప్రభుత్వం లొంగిపోయింద న్నమాట. కేంద్ర బడ్జెట్‌లో ఈ లొంగుబాటుకు నిదర్శనం కనిపిస్తుంది. హార్లీ డేవిడ్సన్ మోటారు సైకిళ్ల పైనా, బౌర్బన్ విస్కీ పైన, విద్యుత్ వాహనాలు, మద్యపానీయాలపైన సుంకాలు తగ్గించడమే అందుకో నిదర్శనం.

మౌన ముద్రతో ఆమోదం: మళ్లీ ఎన్నికైన ట్రంప్‌ను అభినందించడానికి పరిగెత్తిన కొద్దిమంది విదేశీ నాయకులలో ప్రధానమంత్రి మోడీ వున్నారు. అదేదో మోడీ నాయకత్వానికి గుర్తింపు అన్నట్టు బిజెపి, దాని మీడియా మిత్రులూ చిత్రించారు. అయితే ట్రంప్ పొగడ్తల వెనక మన చెయ్యి మెలిపెట్టిన తీరేంటో సంయుక్త పత్రికా గోష్టిలో తెలిసి వచ్చింది. అమెరికా ఉత్పత్తులపై భారత సుంకాలను ట్రంప్ తీవ్రంగా విమర్శించినా మోడీ మాత్రం గమ్మున వుండిపోయారు. సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం దిశగా పని చేస్తున్నట్లు వచ్చిన సంయుక్త ప్రకటన తోటే భారత ప్రభుత్వం ఊరట పొందింది. సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంప్రదింపులు జరపడం ద్వారా భారత దేశం అమెరికా సుంకాల వేటు తప్పించుకోవచ్చని బిజెపి సర్కారు భావిస్తున్నది. అయితే ఆ ప్రతిపాదిత సమగ్ర ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం అసలైన స్వభావం ఏమిటో అమెరికా వాణిజ్య మంత్రి హెూవర్డ్ లుత్నిక్ మీడియా గోష్టితో తేలిపోయింది. వాణిజ్యంలో పెద్దదేదో సాధించేందుకు అమెరికా, భారత్‌లు లక్ష్యం పెట్టుకోవాలని ఆయన అన్నారు. ఆ ఒప్పందం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకుని చూడాలిగాని ఒక్కో సరుకునూ విడివిడిగా చూడకూడదని పేర్కొన్నారు. ఇండియా తన వ్యవసాయ మార్కెట్లలో ప్రవేశం కల్పించాలని ఎలాంటి అస్పష్టత లేకుండా ఆయన తేటతెల్లంగానే చెప్పేశారు. బిటిఎ ద్వారా అమెరికా కోరుకుంటున్నది కేవలం సుంకాలలో రాయితీలు మాత్రమే కాదు. మరింత విస్తృతమైన మార్పులు కోరుతున్నది. వ్యవసాయ సబ్సిడీల తగ్గింపు, ప్రభుత్వ ధాన్య సేకరణలో అమెరికా కంపెనీలకు అవకాశమివ్వడం, అమెరికా ఔషధ కంపెనీలకు మేలు కలిగేలా పేటెంటు చట్టాల సవరణ, సమస్త డేటా బేషరతుగా ఇచ్చిపుచ్చుకోవడాలు అన్నిటినీ కోరుతున్నది. అమెరికాలో భారత వాణిజ్య మంత్రిని కలుసుకున్న తర్వాతనే లుత్నిక్ ఈ వ్యాఖ్యలు చేశారని గమనంలో వుంచుకోవాలి.

వినాశకర పర్యవసానాలు: బిటిఎ ద్వారా వ్యవసాయ మార్కెట్లలో అమెరికా కంపెనీలకు ప్రవేశం కల్పించడం, సుంకాల తగ్గింపు దేశంపై చాలా వినాశకర ఫలితాలకు దారితీస్తుంది. దేశంలో దాదాపు 70 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. భారత



మార్కెట్లలో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను రాయితీలతో అనుమతించడమంటే-ఇప్పటికే సుదీర్ఘ వ్యవసాయ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న అసంఖ్యాకమైన మన ప్రజలను వినాశనం వైపు నెట్టడమే అవుతుంది. అదే రీతిలో భారతీయ పేటెంటు చట్టాలను సడలించడం, దేశీయ పరిశ్రమలను ప్రత్యేకించి ఔషధ పరిశ్రమను చావు దెబ్బ కొట్టడమే అవుతుంది. ఎందుకంటే అమెరికా కంపెనీల భయానక మార్కెట్ ధరలతో పోలిస్తే మన మందుల పరిశ్రమ అందుబాటు ధరలలో మందులు తయారు చేస్తున్నది. ఇక ట్రంప్ విశ్వసనీయ మిత్రుడైన ఎలాన్ మస్క్ తయారు చేసే టెస్లా ఆటోమొబైళ్ల ప్రవేశాన్ని సుగమం చేయడానికే విద్యుత్ వాహనాలపై సుంకాల తగ్గింపు ఉద్దేశితమైంది. అమెరికాకూ దాని బలవంతపు ఎత్తుగడలకూ భారత ప్రభుత్వం అంతకంతకూ వత్తాసుదారుగా మారుతున్నదనే వాస్తవం పదేపదే విదితమవుతున్నది. అక్రమ వలసదారులైన భారతీయులమొదటి బృందాన్ని సంకెళ్లు తగిలించి అవమాన కరంగా అమెరికా సైనిక విమానంలో తరలించినపుడు విదేశాంగ మంత్రి మాత్రం స్త్రీలు, పిల్లల పట్ల అలా వ్యవహరించలేదని కితాబునిచ్చారు. సంకెళు వేయడం, గొలుసులతో కట్టడం మామూలుగా వుండే ప్రామాణిక పద్ధతులేనని సిగ్గు లేకుండా అమెరికా చర్యలకు సమర్ధనగా వంత పాడారు. ప్రజల్లో తీవ్ర నిరసన, ఆగ్రహం వ్యక్తమైన తర్వాత మాత్రమే ప్రభుత్వం ఒక్క మొక్కుబడి ప్రకటన జారీ చేసింది. ఈ విషయం అమెరికా అధికారుల దృష్టికి తెస్తామని అధికార ప్రతినిధితో చెప్పించి సరిపెట్టింది. అందరూ ఆశించినట్టు బలమైన ఖండన గానీ, నిరసన తెల్పడం గానీ జరగనే లేదు.

చిన్న దేశాల కన్నా హీనంగా: బిజెపి ప్రభుత్వం ఇలా లొంగుబాటు ధోరణి ప్రదర్శించగా చిన్న దేశాలైన మెక్సికో, కొలంబియా వంటివి కూడా తమ దేశ పౌరులను ఇలా అవమానకరంగా పంపించడం పట్ల గట్టి నిరసన ప్రకటించాయి. ఉదాహరణకు కొలంబియానే తీసుకుంటే అమెరికా సైనిక విమానాలకు ప్రవేశం నిరాకరించి తన స్వంత సైనిక విమానాలనే పంపించింది.

సుంకాల విషయంలో బిజెపి ప్రభుత్వం మోస పూరితంగా వ్యవహరిస్తున్నది. బహుళ ధృవ ప్రపంచ సమస్యల పట్ల అమెరికా ప్రభుత్వవైఖరి భారత దేశ ప్రయోజనాలకు అనుగుణంగానే వుందని విదేశాంగ మంత్రి లండన్ పర్యటనలో ప్రవచించారు. సుంకాల విషయం అడుగుతుంటే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బిటిఎ) గురించి ప్రస్తావించడం ద్వారా చర్చ దారి మళ్లించారు.

ట్రంప్ వచ్చేలోగానే?: అమెరికాను మెప్పించడం కోసం తాము పూర్తిగా వంగిపోతున్నామని బిజెపి మంత్రులు అంతకంతకూ తమ చర్యలు, ప్రకటనల ద్వారా స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయం వంటి కీలక రంగాలలో కూడా దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ఎంత మూల్యం చెల్లించడానికైనా వారు సిద్ధమవు తున్నట్టు కనిపిస్తుంది. ఈ ఏడాది భారత దేశం నిర్వహిస్తున్న క్వాడ్ శిఖరాగ్ర సమావేశం కోసం ట్రంప్ పర్యటనకు వచ్చే లోగా ఆయన బాగా ఆనంద పరిచేలా వాణిజ్య ఒప్పందం ఖరారు చేయాలని తాపత్రయ పడిపోతున్నారు.

క్వాడ్ అనే సంలీన వ్యవస్థలో భాగం కావాలనే ఆతృతలో బిజెపి ప్రభుత్వం భారతదేశ స్వావలం బనను, దేశ సార్వభౌమత్వాన్ని బలి పెడుతున్నది. ఇది ఎట్టి పరిస్థితుల లోనూ అనుమ తించరాని విషయం. అమెరికా సామ్రాజ్యవాదానికి మోడీ సర్కారు లొంగుబాటును ఎండగట్టడం దీనిపై ప్రజలను భారీ సంఖ్యలో సమీకరించడం తప్పనిసరి. ఎందుకంటే మన దేశ ప్రగతి, సార్వభౌమత్వాల భవిష్యత్తే వీటితో ముడిపడి వుంది.

# గ్రామాల్లో కోతుల బెడద



దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నా యి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడద నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణ మవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుం టున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవే డిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

# స్మార్ట్ మీటర్ స్కాం..!



**ఏలూరు,తెలంగాణ దిశ :** కర్ణాటక ప్రభుత్వ విద్యుత్ శాఖలో భారీ కుంభకోణం చోటు చేసుకుందా? అంటే తాజాగా బీజేపీ ఆరోపణలను పరిగణ లోకి తీసుకుంటే అవుననే అనిపిస్తోంది. అదటుంచి ఈ కుంభకోణం తీరును గమనిస్తే.. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ నేతృత్వ లోంని వైసీపీ ప్రభుత్వం ఎలాగైతే స్మార్ట్ మీటర్ల పేరిట భారీ స్కామ్ చేసిందని అప్పటి ప్రతి పక్షం టీడీపీ ఆరోపించిందో.. ఇప్పుడు కర్ణాటకలోనూ అలాగే జరుగుతోంది.కర్ణాటకలో స్మార్ట్ మీటర్ కొనుగోలులో ఏకంగా ?7,500 కోట్ల స్కాం జరిగిందని ప్రతిపక్షం బీజేపీ ఆరోపించింది. సదరు టెండర్‌ను తయారీదారుల కు కాకుండా సరఫరాదారులకు కేటాయించడం వల్ల స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు, సాఫ్ట్‌వేర్ మద్దతునిచ్చే సంస్థ ఇప్పటికే బ్లాక్‌లిస్ట్ అయిన కంపెనీ అని విమర్శలు వచ్చాయి.ఇతర రాష్ట్రాలతో పోల్చితే కర్ణాటకలో స్మార్ట్ మీటర్ ధరలు భారీగా పెరిగాయి. ఏషియానెట్ న్యూస్‌కు లభించిన డాక్యుమెంట్ల ప్రకారం, సింగిల్ ఫేజ్ మీటర్ ధర 950 నుంచి 4,998కి పెరిగింది. మరో రకమైన సింగిల్ ఫేజ్ మీటర్ ధర 2,400 నుంచి 9,000కి పెరిగింది. త్రిఫేజ్ మీటర్ ధర అయితే ఏకంగా 2,500 నుంచి 28,000కి పెరిగి ంది. గతంలో ఏపీలోనూ ఇలాంటి ఆరోపణలే వచ్చాయి.ఆం ధ్ర ప్రదేశ్ లో రూ.ఏడు వేలు మీటరును రూ.36 వేలు విక్రయిం చారని ఆరోపణలు వచ్చాయి. గతంలో టీడీపీ నేత.. సోమిరెడ్డి పేర్కొన్న వివరాల ప్రకారం.. ఇతర రాష్ట్రాలు ఒక్కో స్మార్ట్ మీటర్‌ను రూ.4 వేలకు కొంటుంటే వైసీపీ ప్రభుత్వం రూ.36 వేల కు కొనుగోలు చేసింది ఈ స్మార్ట్ మీటర్ల కొనుగోలులో రూ.17 వేల కోట్ల అక్రమాలు జరిగాయి. ఈ భారాన్ని అప్పటి ప్రభుత్వం కరెంటు బిల్లుల్లో వేసి వసూలు చేయాలని నిర్ణయించింది. పొలాల్లో వ్యవసాయ బావులకు వాడుతున్న మోటార్లకు కూడా స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని, మోటార్లకన్నా మీటర్ల ధర రెట్టింపు ఉందని అన్నారు. 'రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి రూ.7900 కోట్ చేశారు. ఛండీగఢ్ ప్రభుత్వ కంపెనీ రూ.7100 కోట్ చేసింది. మన రాష్ట్రంలో మాత్రం స్మార్ట్ మీటర్ ధర, నిర్వహణ కలిపి ఏకంగా రూ.36,975కు టెండర్ ఖరారు చేశారు. అని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్‌కు ?900 సబ్సిడీ ఇస్తోంది.

ఇతర రాష్ట్రాల్లో ఈ మొత్తాన్ని టెండర్ కంపెనీలకు మంజూరు చేసి, ప్రజలపై భారం తగ్గించగా, కర్ణాటక ప్రభుత్వం మాత్రం మొత్తం డబ్బును టెండర్ సంస్థలకు చెల్లించడంతోపాటు వినియోగదారుల నుంచి కూడా అధిక వసూళ్లు చేపట్టింది. ఒక్కో మీటర్‌పై ?9,260 అదనంగా ఖర్చు అవుతోందని ఏషియానేట్ ప్రత్యేక నివేదిక వెల్లడించింది.బెస్కాం, మెస్కాం, హెస్కాం, జెస్కాం, సెస్కాంకలిసి మొత్తం 8లక్షల స్మార్ట్ మీటర్ల కోసం 7,408 కోట్ల అదనపు వ్యయం అయింది. ఈ భారీ మొత్తాన్ని ఎవరికి లాభంగా మళ్లించారు ఏ కారణంతో స్మార్ట్ మీటర్ల ధరలు భారీగా పెంచారు టెండర్‌లో జరిగిన గోల్‌మాల్‌కు ఎవరు బాధ్యత వహించాలి? ఈ ప్రశ్నలు సంధిస్తూ హౌస్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని ప్రతి పక్షం బీజేపీ డిమాండ్ చేస్తోంది.

# బిల్లులు చెల్లించకపోతే ఎలా బతకాలి..?



**దేవరాపల్లి, తెలంగాణ దిశ :** బిల్లులు చెల్లించకపోతే ఎలా బతకాలి ? గడ్డి తిని బతకాలా ? అంటు మంగళవారం దేవరాపల్లి మండలంలోని దేవరాపల్లి గర్సింగి తేనుగుబూడి డోర్రచేరువు మారేపల్లి గ్రామాల్లోని ఉపాధి కూలీలు నోట్లో గడ్డి పెట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నాలుగు వారాల నుండి ఎనిమిది వారాల వరుకు అధికారులు బిల్లులను చె ల్లించకపోవ డంపై కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మర్ అలవెన్సు పే స్లిప్పులు పెండింగ్ బకాయిలను చెల్లించాలనే డిమాండ్ల సాధన కోసం ఛలోవిజయ వాడ కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ఆ కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి.దొర పిలుపునిచ్చారు. మంగళవారం కూలీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. పెండింగ్ బకాయిల చెల్లింపులు, సమ్మర్ అలవెన్సులు, పేస్లిప్పులు ఇవ్వకపోవడంతో ఉపాధి కూలీలుతీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. వ్యవసాయ కార్మికులు పనులు లేక ఉపాధి పనులు లేక ప్రతి రోజు వేలాది మంది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వందలాదిమంది సుదూర ప్రాంతాలకు నెలల తరబడి వలసలు పోతున్నారని అన్నారు. ప్రమాదంలో ప్రతి నిత్యం పదుల సంఖ్యలో కూలీలు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువులు కోల్పోయి, వారి పిల్లల భవిష్యత్తు మొగ్గలోనే తుంచి వేయబడుతుందని తెలిపారు. పేదలకోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టం అమలు చేయడంలో చాలా లోపాలున్నాయని అన్నారు. కుటుంబంలో ముగ్గురు, నలుగురు పని చేయడం వల్ల 100 రోజులు త్వరగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఎండకాలంలో నేల గట్టిగా మారి కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు. గతంలో ఇస్తున్న సౌకర్యాలన్ని ఆపేశారని తెలిపారు. ఉపాధిలో రాజకీయ జోక్యం పెరిగి కూలీలకు మస్టర్లు ఇవ్వకుండా రాజకీయ పార్టీ నాయకులకు మస్టర్లు ఇచ్చి పేదలతో డబ్బులు వసూలు చేసుకు ంటున్నారని ఆరోపించారు. పేదలకు వరంలాంటి ఉపాధి హామీ చట్టాన్ని అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై చట్టం స్ఫూర్తిని నీరుగారు స్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసంఉపాధి హామీ అమలు కోసం చట్టాన్ని ఆదర్శవంతమైన అమలుకై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి తేదీన విజయవాడ ధర్నా చౌక్లో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతుందని ప్రకటించారు. 100రోజులు ఉపాధి పని పూర్తి చేసుకున్న గ్రామీణ పేదలకు అదనంగా పని దినాలు పెంచాలని, సమ్మర్ అలవెన్స్ 30 శాతం కలపాలని, ప్రతివారం పే స్లిప్స్,పనిముట్లు, మంచినీళ్ళకు రూ.5లు ఇవ్వాలని, మేట్లకు ప్రతి కూలిపై రూ.5లు పారితోషికం ఇవ్వాలని, ఉపాధి హామీలో యంత్రాలు, కాంట్రాక్ట్ విధానం రద్దు చేయాలని కోరారు. వాటిని వ్యవసాయానికి అనుసంధానం చేయకూడదని, అవినీతిని అరికట్టాలని అన్నారు. మస్టర్లను ఉపాధి సిబ్బందికి మాత్రమే ఇవ్వాలని, రాజకీయ జోక్యం ఉండకూడదని, పమాదాల్లో చనిపోయిన కూలీల కుటుంబాలకు భీమా సౌకర్యం రూ.25 లక్షల నగదు, రెండెకరాల భూమి ఇవ్వాలని, ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు కూలి, బందు పథకం కింద నగదు ఇవ్వాలని, 3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.6 లక్షల నగదుతో పాటు ప్రతి దళిత కాలనీకి 2 ఎకరాల భూమి స్మశాన స్థలంకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# వసూళ్ల భారం కలెక్టర్లపైనే..!



**అమరావతి, తెలంగాణ దిశ :** ఖజానాను నింపే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్లపైన పెడుతోంది. కలెక్టర్ల సదస్సు రెండోరోజైన బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపైనే ప్రధానంగా దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు కూడా తమ జిల్లాల్లో ఆదాయ స ముపార్జనకు ఉన్న అవకాశాలను, తీసుకునే చర్యలను వివరించా రు. మొండి బకాయిల వసూళ్లలో అవసరమైతే కలెక్టర్లు సంబంధిత శాఖలకు సహకరించాలని, ఈ విషయంలో కఠింసగా వ్యవహరిం చాలని సిఎం సూచించినట్లు తెలిపింది. అదే విధంగా వృత్తి పన్నును పెంచాలన్న ప్రతి పాదనల నేపథ్యంలో జిల్లాలలో కూడా దీనిపైదృష్టి సారించాలని చెప్పినట్లు సమాచారం. ఆస్తి పన్ను వసూ ళ్లను కూడా సీరియస్ గా తీసుకోవాలని, అవసరమైతే చర్యలకు ఉపక్రమిం చాలని కూడా కలెక్టర్లకు సిఎం సూచించినట్లు తెలిసింది. వ్యాపార, వాణిజ్య సంస్థలు, వ్యక్తుల నుంచి జివిస్టి బకాయిలు పెరుగుతున్నాయని, వాటిని పూర్తిగా వసూలు చేసేందుకు కూడా సహకరించాలని కోరారు. జిల్లాలో పలు హెూటళు రెస్టారెంట్లు రిజిస్ట్రేషన్ కూడా చేసుకోకుండా నడుస్తున్నాయని, వాటిని తప్పనిసరి గారిజిస్ట్రేషన్ చేయించుకునేలా చూడాలని ఈ సమావేశంలో నిర్ణయి ంచారు. ఏడాదిలోగా ఈదిశలో చర్యలు తీసుకుంటామని పలువురు కలెక్టర్లు హామీ ఇచ్చారు. గనులకు సంబంధించి కూడా దృష్టి పెట్టాలని నిర్ణయించారు. గనులకు అనుమతులు, నిబంధన లను అతిక్రమించి తవ్వకాలు జరుపుతుం డడం, ఇసుక తవ్వకాల్లో డీసిల్టేషన్ విధానం వంటి వాటిని కూడా సక్రమంగా అమలు చేసి ఆదాయానికి గండి పడకుండా చూడాలని భావిస్తున్నారు. ఆదాయా నికి ఏఐ జిల్లాల్లో ఆదాయం తగ్గకుండా చూసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు వినియోగించుకునే అంశం కూడా చర్చకు వచ్చింది. ఎక్కడ నుంచి ఎంత ఆదాయం రావాల్సి ఉంటుంది, అందుకే ఈ విధానంపైనా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

# మహిళా రైతులకు డ్రోన్లు...

**వరంగల్, తెలంగాణ దిశ :** వసాయ రంగంలోనూ యంత్రాల వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. సాగు విస్తీర్ణం పెరగడంతో కూలీల కొరత ఏర్పడుతున్న నేపథ్యంలో.. విత్తు నాటే సమయం నుంచి పంట ఇంటికొచ్చే సమయం వరకు పలు సందర్భాల్లో వివిధ రకాల యంత్రాలను రైతులు వినియోగిస్తున్నారు. దీంతో రైతులకు అవసరమైన యంత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై అందిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంను రేవంత్ సర్కార్ మళ్లీ అమలు చేసేందుకు నిర్ణయించింది. అయితే, ఈసారి మహిళలకే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.తెలంగాణ ప్రభుత్వం మహిళా రైతులకు శుభవార్త చెప్పింది. వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. 2018లో అప్పటి ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు యాంత్రీకరణ పనిముట్లను అందజేసే కార్యక్రమాన్ని నిలిపివేసింది. గతంలో ఎస్సీ, ఎస్టీలకు 90శాతం, ఇతరులకు 50శాతం సబ్సిడీ ఉండేది. ప్రస్తుతం అందరికీ 50శాతం సబ్సిడీతో ఈ యాంత్రీకరణ పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.వ్యవసాయ యాంత్రీకరణలో తొలిసారిగా మహిళా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 10,812 యూనిట్లు అందజేసేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు మార్గదర్శకాలతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 24.90 కోట్ల సబ్సిడీని రైతులకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే.. ఈనెల 31వ తేదీలోగా పథకాన్ని అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ప్రస్తుతం సమయం తక్కువగా ఉండటంతో లబ్ధిదారుల ఎంపికలో అధికారులు తలమునకలయ్యారు.వ్యవసాయ పనుల్లో రైతులకు దోహదపడే 14 రకాల యంత్ర పరికరాలను 50శాతం సబ్సిడీతో మహిళా రైతులకు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా చేతిపంపులు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్లు, రోటోవేటర్లు, విత్తనాలు/ ఎరువులువేసే పరికరాలు, ట్రాక్టర్లతో దమ్ముచేసే పరికరాలు, పవర్ టిల్లర్లు, ఎద్దులతో బోదలు పోసే పరికరాలు, ట్రాక్టర్లతో బోదలుపోసే పరికరాలు, పవర్ వీడర్స్, బ్రష్ కట్టర్స్, ట్రాక్టర్లు, మొక్కజొన్న కోత పరికరాలు, గడ్డిచుట్టే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించనుంది.ఈ నెలాఖరులోగా మహిళా రైతుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించనున్నారు. జిల్లాలకు కేటాయింపుల ఆధారంగా ఆయా మండలాలకు నిధులు, లబ్ధిదారుల సంఖ్య కేటాయింపులు చేయనున్నారు. లక్ష రూపాయల లోపు యూనిట్ ఉంటే మండల వ్యవసాయ శాఖ అధికారి కన్వీనర్ గా ఉన్న కమిటీ, లక్షకు మించితే కలెక్టర్ చైర్మన్ గా ఉన్న కమిటీ లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఎంపికయిన వారికి సబ్సిడీపై వారు కోరుకున్న యంత్రాలను అందిస్తారు.

# ఉపాధి కూలీలకు అండ

## పని క్షేత్రాల్లో రక్షణ చర్యలు



**నిజామాబాద్, తెలంగాణ దిశ :** జిల్లాలో వేసవి నిబంధనలతో ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతా ల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగు ంటలు,ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపిగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధించిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడుతారు.కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కూలీలకు పనిరోజులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తాయి. జూన్‌నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు వ్యవసాయ కూలీలు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిహామీ పనులపై ఆధారపడుతున్నారు.

# టీజీఎస్పీడీసీఎల్ యాప్ లో విద్యుత్ బిల్లుల చెల్లింపులు



**పెద్దపలి, తెలంగాణ దిశ :**విద్యుత్ బిల్లుల చెల్లింపులు టీజీఎస్పీడీసీఎల్ యాప్ నుండి కూడా చేయవచ్చని పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు తెలిపారు. గురువారం ఆయన మీడియాకు ఇచ్చిన ప్రకటన మేరకు నెల వారి విద్యుత్ బిల్లులు టీజీఎస్పీడీసీఎల్ యాప్‌ద్వారా చెల్లించడం చాసులభమని, సురక్షితమని అన్నారు. వినియో గదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ లో ప్లే స్టోర్ కి వెల్లి టీజీఎస్పీడీసీఎల్ టైప్ చేసి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం టీజీఎస్పీడీసీఎల్ యాఎలో వెల్లి వినియోగదారునియూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేసి బిల్లు చెల్లించవచ్చున్నారు. ఇలాగే ప్రతి నెల జెనరేట్ అయ్యిన బిల్లు తాలుకు సమాచారం ఆటోమేటిక్ వస్తుందని, దీనిని ఇంట్లోనే ఉండి కేవలం రెండునిమి షాల్లో చెల్లించవ చ్చునని తెలిపారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో 51,163 వినియోగదారులు తమ నెల వారి విద్యుత్ బిల్లులు టీజీ ఎస్పీడీసీఎల్ యాప్ తోపాటు గూగుల్ పే , ఫోన్ పే , పే టియం ద్వారా కూడా చెల్లిస్తున్నారని వివరించారు.

# నిశ్చితార్థం అయిన తర్వాత బట్టతల ఉందని పెళ్లికి నిరాకరణ

**హైదరాబాద్, తెలంగాణ దిశ :** నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లికి యువతి నిరాకరించడంతో యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఈ విషాదకర ఘటన హైదరాబాద్‌లో చోటుచేసు కుంది. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన ప్రకాష్‌మాల్ దంపతులకు ఇద్దరు కుమారులు.. వీరిలో చిన్న కుమారుడు పురోహిత్ కిషోర్ ఎంబీబీఎస్ డాక్టర్‌గా అల్వాల్ బస్తీ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు.. ఈ క్రమంలోనే.. కిషోర్‌కు కొన్నిరోజుల కిందట ఓ అమ్మాయితో నిశ్చితార్థం జరిగింది. అంతా బాగానే ఉందనుకున్న క్రమంలోనే.. కిషోర్ కు బట్టతల ఉండడం, ఇతర కారణాల వల్ల ఆ అమ్మాయి అతనితో పెళ్లికి నిరాకరించింది..

దీంతో నిశ్చితార్థం అర్థాంతరంగా రద్దయింది. ఆ తర్వాత కిషోర్ కు వివాహం చేసేందుకు కుటుంబసభ్యులు సంబంధాలను చూస్తున్నా కుదరడం లేదు.. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన కిషోర్ బుధవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై ఇంట్లో నుంచి బటయకు వెళ్లాడు.. ఆ తర్వాత బొల్లారం వెళ్లి అక్కడ రైల్వేస్టేషన్ వద్ద వాహనాన్ని ఉంచాడు.. అనంతరం సమీపంలోని క్యావలరీ బ్యారక్ రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకున్న కిషోర్.. నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్‌కు వస్తున్న హుజూర్‌సాహిబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. గుర్తించిన రైలు లోకో పైలెట్.. జీఆర్పీ పోలీసులకు సమాచారాన్ని అందించారు.. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. అతని వద్ద ఉన్న గుర్తింపు కార్డు చిరునామా ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు.. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా.. కిషోర్ మృతితో కుటుంబంలో విషాదఛాయులు అలుముకున్నాయి..

# వరికి మద్దతు ధర కరువు..

**మిర్యాలగూడ, తెలంగాణ దిశ :**ప్రభుత్వ అధికార యంత్రాంగం ముందు చూపు లేక అన్నదాతలు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించడం లేదురు. మిల్లర్లు పెట్టిన ధర కు రైతులు విక్రయించాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతలు కష్టించి పండించిన ధాన్యానికి ధర అందక నానా అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రభీ ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని మిల్లర్ల ను హెచ్చరించిన ఫలితం లేకపోయిందని అన్నదాతలు వాపోతున్నారు.

ఖరీఫ్ ధరలేవి..?: ఖరీఫ్ సిజన్‌లో ధాన్యం చెల్లించిన ధరలో దగ్గరగా లేకుండా కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ లో క్వింటాళ్లకు రూ. 2800 చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేశారు. కానీ రబీ సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు అవుతున్న ధరలు మాత్రం పెంచడం లేదు. గత వారం రోజుల నుంచి గిట్టుబాటు ధర కు కొనుగోలు చేయకపోవడమే కాక కనీస మద్దతు ధర కూడా చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2320 ఉండగా మిల్లర్లు కేవలం రూ. 2100 నుంచి 2250 వరకు ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొందరు మిల్లర్లు అసలు కొనుగోలు చేయడంలో ఆసక్తి చూపడం లేదని రైతులు వాపోతున్నారు.

భారీగా నష్టపోతున్న రైతులు..: వరి సాగులో పెట్టుబడులు పెరిగి ఇబ్బంది పడుతున్న రైతులు ధాన్యం విక్రయంలో నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు ధర వస్తాదని ఆశించి సన్నాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధర కూడా రాక క్వింటాళ్లకు రూ. 500 వరకు నష్టం వాటిల్లితుంది. ఇప్పటికే మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా లక్షల క్వింటాళ్ల ధాన్యం విక్రయాలు జరిగినట్లు అంచనా ఉంది. ఈ విధంగా రైతులు కోట్ల రూపాయాలు నష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

మిల్లర్ల మాయాజాలం..: మిర్యాలగూడ నియోజకవర్గం లో వందల సంఖ్యలో మిల్లులు ఉండటంతో ధాన్యం కొనుగోలు లో మిల్లర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. మిల్లర్లు సిండికేట్ గా ఏర్పడి విడతల వారీగా కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా వేములపల్లి ,మిర్యాలగూడ మండలాల లో కొందరు మిల్లర్లు ఉదయం కొంతమేరకు కొనుగోలు చేసి మిల్లర్ల గేట్లకు తాళాలు వేస్తున్నారు. కొందరు సాయంత్రం వేళ కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రాత్రి అవుతుండటం వలన ధరలు మరింత తగ్గిస్తున్నారు. దీంతో రాత్రి బస చేయలేక రైతులు మిల్లర్లు పెట్టిన ధరకే అమ్ముకుంటున్నారు.

మద్దతు ధర చెల్లింపులపై కొరవడిన నిఘా..: మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం దృష్టి సారించడంలో జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. గత సీజన్లో రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం మిల్లర్ల వద్ద మద్దతు ధర చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు పేర్కొన్నారు . రెండు రోజుల క్రితం వేములపల్లి మండలం శెట్టి పాలెం మిల్లర్లు వద్ద మద్దతు కూడా పెట్టడం లేదని ఓ రైతు నేరుగా కలెక్టర్ కుఫోన్ లో ఫిర్యాదు చేశాడు. మద్దతు ధర చెల్లించని మిల్లులపై చర్యలేవి ..: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరచెల్లించని మిల్లుల పైచర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.2100 లకే ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. శెట్టి పాలెం సమీపంలో ఉన్న మిల్లర్లు గత నాలుగు రోజుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి మిల్లులలో ధాన్యం విక్రయ రికార్డులుపరిశీలించి చర్యలు తీసుకోవా లని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల మిల్లర్లు మద్దతు ధర చెల్లించే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్వోబీలతో మహర్దశ...!

**గుంటూరు, తెలంగాణ దిశ :**ఏపీలో కొత్తగా మరో ఆర్‌వోబీ నిర్మాణం కానుంది. ఏపీలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత.. పలు ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఏపీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు లభిస్తు?న్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రూ.129.18 కోట్లతో మంగళగిరి ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఆ మేరకు నిధులు మంజూరు చేస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. మంగళగిరిలో ఆర్‌వోబీ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైల్వే శాఖను ఇటీవల అభ్యర్థించారు. కేంద్ర మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ.. మంగళగిరిలో నాలుగు వరుసల ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసింది.గుంటూరులోని గడ్డిపాడు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సైతం రైల్వేశాఖ ఇటీవల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. గడ్డిపాడు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 107.79 కోట్లు మంజూరు చేసింది. రైల్వే గేటు కారణంగా ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో విజయవాడవైపు వెళ్లే వారికి నిరీక్షణ తప్పడం లేదు. ఈ నేపథ్యంలో ఆర్‌వోబీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. గుంటూరు-నంబూరు రైల్వేస్టేషన్ల మధ్య గడ్డిపాడు వద్ద నాలుగు వరుసలుగా దీనిని నిర్మిస్తారు. ఈ ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే పేరేచర్ల నుంచి విజయవాడ వెళ్లేవారికి అనుకూలంగా ఉంటుంది. అలాగే హైదరాబాద్, నరసరావుపేట, పల్నాడు నుంచి వచ్చే భారీ వాహనాలను గుంటూరులోకి రాకుండా దారి మళ్లించేందుకు వీలవుతుంది.మరోవైపు గుంటూరులో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు శంకర్ విలాస్ పైవంతెనతో పాటుగా ఆర్వోబీల నిర్మాణం చేపడతామని ఎన్నికల సమయంలో పెమ్మసాని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఇక ఇచ్చిన హామీ ప్రకారం కేంద్ర సహాయ మంత్రి హోదాలో నిధుల మంజూరుకు ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలోనే ఇప్పటికే గుంటూరు శంకర్‌విలాస్ ఫ్లైఓవర్‌కు ఇటీవల రూ. 98 కోట్లు మంజూరు చేయించారు.

# వైరల్ అవుతున్న కోమటిరెడ్డి కామెంట్స్?



**హైదరాబాద్, తెలంగాణ దిశ :**కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనను మించిన నేత లేరన్న భావనలో ఉన్నట్లుంది. మంత్రి వర్గ విస్తరణపై కోమటిరెడ్డి చేసిన కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ లో కాక రేపుతున్నాయి. తనకు మంత్రి పదవి వస్తుందని అనుకుంటున్నా నని అనడం వరకూ ఓకే కానీ, సామర్థ్యాన్ని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని కోరడంలో ఆంతర్యమేంటని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. భువనగిరి పార్లమెంటు నియోజవర్గంలో జరిగిన ఎన్నికలు జరిగితే తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించానని తలిపారు. అదే సమయంలో ప్రజల పక్షాన తాను నిలబడతానని అన్న కోమటిరెడ్డి తనకు హోంశాఖ అంటే ఇష్టమంటూ మనసులో మాటను బయటపెట్టారు. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక విషయం గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. 2018 ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ నాయకత్వంపై అలిగి బీజేపీలోకి వెళ్లిన కోమటిరెడ్డి తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ తరుపున పోటీ చేసి ఎందుకు ఓటమి పాలయ్యారంటూ ప్రశ్నిస్తున్నారు. అంత కెపాసిటీ ఉంటే నాడు ఉప ఎన్నికల్లోనూ గెలిచేవారివిగా అంటూ కొందర సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తు న్నారు. తనకు తాను తోపు అని ఊహించుకుంటే సరిపోదని, ప్రజలు ఆదరిస్తేనే ఎవరైనా ఎమ్మెల్యే అవుతారని తెలిపారు. కాంగ్రెస్ అధినా యకత్వం పై అలిగి బీజేపీ లోకి వెళ్లిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తర్వాత ఎందుకు మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చారని నిలదీస్తున్నారు. డబ్బు ఉంటేనే సరిపోతుందా? అని ఫైర్ అవుతున్నారు.. మీ సోదరుడు లాగా పార్టీని నమ్ముకుని ఉండకుండా ఎందుకు పార్టీని మార్చాల్సి వచ్చిందో చెప్పాలన్నారు. కోమటిరెడ్డి కుటుంబానికి రెండు మంత్రిప దవులు ఇవ్వడమేంటని కూడా కాంగ్రెస్ అభిమానులు ప్రశ్నిస్తున్నారు. పార్టీలు తమ ప్రయోజనాల కోసం మారేవారికి మంత్రి పదవులు ఇవ్వకూడదని కొందరు ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు పంపినట్లు తెలిసింది. పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండా మోస్తూ ఆ పార్టీ నీడలోనే కష్టాలు పాలయిన నేతలకు మాత్రమే మంత్రి పదవి ఇస్తే బాగుంటుందని, అంతే తప్ప ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చారంటూ మంత్రి పదవులు అప్పజెపితే ఫిరాయింపులకు అధినాయకత్వమే ప్రోత్సహించినట్లవుతుందని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. గడ్డం వివేక్ కు కూడా ఇదే విధానం వర్తిస్తుందని, కాంగ్రెస్ ను నమ్ముకున్న వారికే మంత్రి పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీలో డిమాండ్ ఊపందుకుంది.

# అధికారుల అత్యుత్సాహం

**అదిలాబాద్, తెలంగాణ దిశ :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డులో నివాసముంటున్న ఓ దళిత కుటుంబంపై శనివారం సాయంత్రం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించారు. ఇంటి పన్ను కట్టలేదని కుటుంబాన్ని బయటకు రమ్మని, మహిళ అని కూడా చూడకుండా వారి కోడలు పిల్లలను లోపల ఉండగానే దౌర్జన్యంగా గేటుకు తాళం వేసినట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులు గడువు ఇవ్వాలని కోరిన మాట వినలేదని చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్నామని చెప్పినా పట్టించుకోకుండా నానా హంగామా చేసి పరువు తీశారని వాపోయారు. దళితులమనే చిన్న చూపుతోనే మున్సిపల్ అధికార యంత్రాంగం హేళన చేసి పరువు తీశారని, మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి తమను మనస్తాపానికి గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.ట్యాక్స్ కట్టలేదని చెప్పడానికి ఇద్దరు, ముగ్గురు వచ్చినా సరిపోతుంది కదా చాలా మంది ఎందుకు వచ్చారని అడగటంతో ఇంటి వద్ద గొడవ జరిగింది. ఇష్టం వచ్చినట్లు మాట్లాడకూడదని, నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలని బాధిత కుటుంబం కోరింది. పైసలు కట్టకపోతే రౌడీయిజం చేయడానికి వచ్చారా అని స్థానికులు మంచిర్యాల మున్సిపల్ అధికారులు, సిబ్బందిని నిలదీశారు. బకాయి ఉంటే ప్రశ్నించండి, నోటీసులు ఇచ్చి వెళ్లిపోవాలి కానీ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం ఏంటని నిలదీశారు. ప్రజల్ని కొట్టి, వారి మీద దాడిచేసి డబ్బులు వసూలు చేయడానికి రావడం ఏంటని ప్రశ్నించారు.మీరు అధికారుల్లాగ ప్రవర్తించండి, రౌడీలు, గూండాల మాదిరగా అంత మంది రావడం ఏంటి, వచ్చి సామాన్యులపై రౌడీయిజం సరికాదని స్థానికులు అన్నారు. పర్మిషన్ ఉంటే మాత్రం ఐడీ కార్డులు వేసుకుని చాలా మంది ఒక్క ఇంటి మీదకు వచ్చి గుండాయిజం చేసి, వారి ఇంటి గేటుకు తాళం వేయడం సరికాదంటూ అధికారులతో ట్యాక్స్ కట్టకపోయినా ప్రజలకు దాని వల్ల ఏం నష్టం జరుగుతంది, ఏ ప్రయోజనాలు కోల్పోతారో చెప్పాలి

# అమెరికా ఆటో టారిఫ్‌లు మా దేశంపై ప్రత్యక్ష దాడి

టొరంటో: అమెరికా ఆటోలపై విధించిన టారిఫ్‌లపై కెనడా ధ్వజమెత్తింది. ఈ టారిఫ్‌లు తమ దేశంపై ప్రత్యక్ష దాడిగా అభివర్ణించింది. "అమెరికా టారిఫ్‌లు మా దేశంపై ప్రత్యక్ష దాడి, మా కార్మికులను రక్షించుకుంటాం, మా కంపెనీలను రక్షించుకుంటాం, మా దేశాన్ని రక్షించుకుంటాం" అని ప్రధాని మార్క్ కార్నీ పేర్కొన్నారు. అయితే ప్రతీకార చర్యలకు ముందు ట్రంప్ ఉత్తర్వులను పరిశీలించాల్సివుందని అన్నారు. ఇది అన్యాయమని దుయ్యబట్టారు. మందస్తుగా 1.4 బిలియన్ డాలర్ల 'వ్యూహాత్మక ప్రతిస్పందన నిధి'ని ప్రకటించారు. ఈ నిధి ట్రంప్ విధించే సుంకాల వలన ప్రభావితమైన కెనడా ఆటో ఉద్యోగాలను కాపాడుతుందని అన్నారు.ఆటోలు కెనడా రెండవ అతిపెద్ద ఎగుమతిగా ఉన్నాయని, ఈ పరిశ్రమలతో 1,25,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తుండగా, సుమారు 5,00,000 మందికి సంబంధిత పరిశ్రమలలో పరోక్షంగా ఉపాధి కలుగుతోందని అన్నారు. కెనడా ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉంటుందని అన్నారు. అమెరికా సంబంధాలపై ప్రత్యేక కేబినెట్ గురువారం సమావేశం కానుంది. ఈ కమిటీకి అధ్యక్షత వహించేందుకు ఎన్నికల ప్రచారాన్ని వీడి తాను ఒట్టావాకు వెళ్లనున్నానని అన్నారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆటో దిగుమతులపై 25 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇవిశాశ్వతమని అన్నారు. ట్రంప్ గతంలో నూమెక్సికో,కెనడాల నుండదిగుమతులపై అమెరికా వాహన తయారీదారులకు కొత్త సుంకాలపై ఒక నెల మినహాయింపు ఇచ్చిన సంగతి తెలిసిందే. రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌టారిఫ్‌లతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యయుద్ధానికి తెరతీశారు.

# బర్లీ పొగాకు రైతులు-సమస్యలు!



గత రెండు మూడు సంవత్సరాలు బర్లీ పొగాకు రేటు లాభసాటిగా ఉండటంతో బర్లీ పొగాకు వైపు రైతులు మళ్లారు. గత సంవత్సరం అడుగు ఆకు కూడా క్వింటాలు పదివేల రూపాయలకు అమ్ముడు పోయింది. ఈ సంవత్సరం అడుగు ఆకు నాలుగైదు వేల రూపాయలకు మించలేదు. కంపెనీలు బాండు ఇచ్చినా పొగాకు కొనటం మందంగా ఉంది. 30-40 వేల రూపాయలకు ఒక ఎకరం పొలం కౌలుకు తీసుకొని, బర్లీ పొగాకు పంటను వేసిన రైతులున్నారు. 2023-24 సంవత్సరంలో భారతదేశ పొగాకు ఎగుమతులు రూ.12,006 కోట్లు. 2022-23లో భారతదేశంలో పొగాకు అమ్మకాల ద్వారా వచ్చిన ఎక్సైజ్ ఆదాయం రూ.72,788 కోట్లు. ప్రభుత్వానికి ఇంత ఆదాయం వస్తున్నా రైతులకు ఆశ, నిరాశలను చూపిస్తూ ప్రభుత్వం, కంపెనీలు రైతులతో ఆడుకుంటున్నాయి. పొగాకు బోర్డు: పొగాకు రైతులకు న్యాయమైన, లాభదాయకమైన ధరలు లభించేలా చూడటం, ఎగుమతులను ప్రోత్సహించటం బోర్డు ప్రాథమిక కర్తవ్యం. అయితే పొగాకు బోర్డు ఒక్క ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు (ఎఫ్.సి.టి) గురించి మాత్రమే పట్టించుకుంటుందట. బర్లీ పొగాకు, నాటు పొగాకు లాంటివి తమ పరిధిలో లేవని తప్పుకుంటోంది. పొగాకు పండించే రైతులందరి ప్రయోజనాలను కాపాడవలసిన పొగాకు బోర్డు%ౌ%బర్లీ పొగాకు పండించిన రైతులను కంపెనీల దయా దాక్షిణ్యాలకు వదిలేసింది. బర్లీ పొగాకుకు విదేశాలలో ఎక్కువ డిమాండ్ వుంది. అమెరికా, బ్రిటన్‌లో తయారయ్యే సిగరెట్లలో బర్లీ పొగాకు ప్రధాన స్థానాన్ని పొందింది. సిగరెట్‌లో మంచి ఫ్లేవర్ కోసం, ఘాటుగా వుండటం కోసం బర్లీ పొగాకును సిగరెట్ తయారీలో తప్పనిసరిగా వాడతున్నారు. ఇదివరకు అమెరికా లోని కెంటకీ రాష్ట్రంలో బర్లీ పొగాకును ఎక్కువగా సాగు చేసేవారు. అక్కడ బర్లీ పొగాకు సాగు తగ్గింది. దేశ, విదేశీ అవసరాలకు 100 మిలియన్ కేజీల బర్లీ పొగాకు అవసరం వుంటుందని అంచనా.

పొగాకు పరిశోధనా సంస్థ: తూర్పు గోదావరి జిల్లాలో కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ సి.టి.ఆర్.ఐ 75 సంవత్సరాల నుండి రాజమండ్రిలో పనిచేస్తున్నది. దక్షిణ ప్రాంతపు తేలిక నేలలు ఉన్న ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలలో సాగు చేసే బర్లీ పొగాకు నూతన విత్తనాలను 'విజేత' పేరున విడుదల చేశారు.

ఇదివరకు పది వేల మిలియన్ కేజీల ఎగుమతి ఉన్న బర్లీ పొగాకు ఇప్పుడు 45 వేల మిలియన్ కేజీలకు పెరిగిందని ఆ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు అన్నారు.

ప్రత్యామ్నాయ పంటలైన మిర్చి, శనగ, మొక్కజొన్న, సుబాబుల్, జామాయిల్, పామాయిల్ పంటలు వేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కానీ ప్రత్యామ్నాయ పంటల ధరలకు గ్యారంటీ లేదు. కనీస మద్దతు ధరలు అమలు పరచే యంత్రాంగం లేదు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత లేదు.

కచ్చితంగా కొంటారనే గ్యారంటీ లేదు. వ్యవసాయ ఖర్చులు-ఎరువులు, పురుగు మందులు, కౌలు, కూలీ రేట్లు భారీగా పెరిగాయి. ఇటువంటి పరిస్థితులలో పొగాకు ధరలు గత రెండు సంవత్సరాలుగా ఆశాజనకంగా వున్నాయి. గతంలో పొగాకు సాగును ఆపేసిన పాత గుంటూరు జిల్లా రైతులు మళ్లీ పొగాకు పంట వైపు మళ్ళారు. పొగాకు సాగు గణనీయంగా పెరిగింది.

పొగాకు బోర్డు పరిధిలో బర్లీ పొగాకు ఎందుకు లేదు? ప్రభుత్వం స్పందించాలి!: ఇండియన్ టొబాకో కంపెనీ, గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్, దక్కన్ టుబాకో, పోలిశెట్టి కంపెనీ, పి.టి.పి, ఎం.ఎల్ మరియు అలియన్స్ వన్ కంపెనీలు బర్లీ పొగాకు సాగును ప్రోత్సహించాయి. కొందరు విత్తనాలిచ్చారు. కొందరు హామీలిచ్చారు. పొగాకు నారును సప్లరు చేశారు. కచ్చితంగా కొంటామని కొన్నిచోట్ల బాండ్లు ఇచ్చారు. పొగాకు బోర్డు పరిధిలో బర్లీ పొగాకు లేకపోవడంతో రైతులకు నష్టం జరుగుతుంది.

బేరన్ పొగాకు / వర్జీనియా పొగాకు సాగు చేస్తున్నటువంటి రైతులకు టుబాకో బోర్డు కొన్ని రక్షణలు కల్పిస్తున్నది. టుబాకో బోర్డు కల్పిస్తున్న రక్షణలు, ప్రయోజనాలు బర్లీ పొగాకు పండించే రైతులకు లేవు. గత సంవత్సరం ధరలు కూడా రావటం లేదు. గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, ఏ ప్రాంతంలో ఏరకమైన పొగాకు, ఎంత మొత్తంలో సాగు చేశారనేది ప్రభుత్వం దగ్గర అంచనాలు ఉన్నాయో లేదో తెలియనటువంటి పరిస్థితి. పొగాకు మార్కెట్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మరెవరు జోక్యం చేసుకుంటారు? పొగాకు బోర్డు తన పరిధిలో లేదంటుంటే ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. రైతులు నిలువెత్తున మునిగిపోతుంటే చూస్తూ ఊరుకుంటారా?

పంటలకు న్యాయమైన ధరలను సాధించుకోగల శక్తి రైతుల చేతుల్లోనే: ప్రపంచంలోని పొగాకు ధరలు, సిగరెట్ల ధరలు, ఐ.టి.సి, బ్రిటిష్ అమెరికన్ టుబాకో కంపెనీ, ఫిలిప్ మోరిస్ లాంటి బహుళజాతి సంస్థల (యం.యన్.సి) చేతిలో వున్నాయి. వారి లాభాలకు అంతులేదు. వారి నుండి పంటలకు న్యాయమైన ధరలను సాధించుకోగల శక్తి రైతుల చేతులలోనే వుంది. ప్రజా ఉద్యమాలతోనే తమ న్యాయమైన వాటాను సాధించకోగలరు.


కార్పొరేట్ కంపెనీల చేతులలో కీలు బొమ్మలైన ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాలను కాపాడ లేవు. బహుళజాతి సంస్థలు రైతుల సంక్షేమం కోసం ఏర్పడలేదు. గిట్టుబాటు ధరలు కల్పించితే వారి లాభాలు తగ్గిపోతాయి. నీతి, జాతి లేనటువంటి యం.యన్.సి.లు, వారితో పోషింపబడుతున్న ప్రభుత్వాధిపతులు రైతులను కాపాడతారనుకుంటే, గొర్రె కసాయివాడిని నమ్మినట్లవుతుంది. లాభసాటి ధర కావాలంటే రైతులు నిలబడాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించి అమలు పరచమని పోరాడాలి.



## నార్సింగిలో విచ్చలవిడిగా రెడీమిక్స్ వాహనాలు రాకపోకలు

మణికొండ:గత కొన్ని రోజులుగా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో రెడీమిక్స్ వాహనాలకు నో ఎంట్రీ నిబంధన లేకుండా పోయింది. రాత్రి 10:00 నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు మాత్రమే భారీ వాహనాలను రోడ్లపైకి అనుమతివ్వాలని పోలీసులు నిబంధనలను విధించారు. కానీ నార్సింగి, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రెడీమిక్స్ వాహనాలతో పాటు భారీ వాహనాలు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఫలితంగా పలుచోట్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడగా, మరికొన్ని చోట్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇవన్నీ తెలిసిన ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు "మామూలు"గా తీసుకుంటున్నారు. ఫలితంగా వాహనచోదకులు ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుకుంటున్నారు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ సర్వీస్ రోడ్డులో రెడీమిక్స్ వాహనాలు ఇష్టానుసారంగా నడుపుతున్నారు. అదేవిధంగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టి నాగులపల్లి ఔటర్ సర్వీస్ రోడ్డుతో పాటు క్యాసిటీ, మైక్రోసాఫ్ట్ జంక్షన్, టీ గ్రిల్ తదితర ప్రాంతాలలో రెడీమిక్స్ వాహనాలతో పాటు భారీ వాహనాలు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నడుస్తున్నాయి. ఔటర్ సర్వీస్ రోడ్డుపై అతివేగంగా, అజాగ్రత్తగా మైనర్ డ్రైవర్లతో ఈ వాహనాలను నడుపుతుండడంతో ఎప్పుడు ఇలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఔటర్ సర్వీస్ రోడ్డు నుంచి ఖానాపూర్ గ్రామం వైపు వెళ్లే రహదారిలో గత కొన్నాళ్లుగా ఓ పంచర్ దుకాణం ఏకంగా రహదారిలోనే వాహనాలను నిలిపి పంచర్ చేస్తున్న దృశ్యాలను నిత్యం ట్రాఫిక్ పోలీసులు చూసి "మామూలు"గా తీసుకుంటున్నారు. దీంతో ఖానాపూర్ వైపు వెళ్లాలంటే ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటుంది. ఈ విషయంపై గతంలో నార్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నచిన్న ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపై తమ ప్రతాపాన్ని చూపే ట్రాఫిక్ పోలీసులు పట్టపగలే ఔటర్ సర్వీస్ రోడ్డుపై రెడీమిక్స్ వాహనాలు కుప్పలు కుప్పలుగా తిరుగుతున్న ట్రాఫిక్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సదరు రెడీమిక్స్ ప్లాంట్ల యజమానుల వద్ద నుంచి నెలవారి వసూలు చేస్తుండడంతోనే ఆ వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అదేవిధంగా కోకాపేట మైక్రో బిల్డింగ్ ఎదురుగా ఓ నిర్మాణ రంగ సంస్థ ఏకంగా రోడ్డుపై కంటైనర్లు ఏర్పాటు చేసుకుని నిర్మాణాలు చేస్తుంటే ట్రాఫిక్ అధికారులు అటుగా చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో వాహనాలు రాకపోకలను నిలుపుదల చేసి విధులు నిర్వహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు తప్ప ట్రాఫిక్ నిబంధనలను ఎక్కడ గాడిలో పెడుతున్నట్లు లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

## స్టార్ హీరో ప్రేమలో పడ్డ నిధిఅగర్వాల్



సినిమా ఇండస్ట్రీలో చాలా మంది పెళ్లి చేసుకొని కొత్త జీవితాలను ప్రారంభిస్తున్నారు. అలాగే కొంతమంది లవ్ ఎఫర్స్ తో వార్తల్లో నిలుస్తున్నారు. చాలా మంది ముద్దుగుమ్మలు ప్రేమలో తేలిపోతున్నారు. కొంతమంది బిజినెస్ మ్యాన్స్ తో ప్రేమాయణం సాగిస్తుంటే మరికొంతమంది మాత్రంతోటి నటులతో ప్రేమలో తేలిపోతున్నారు. అలాగే ఇప్పుడు ఓ క్రేజీ బ్యూటీ స్టార్ హీరోతో ప్రేమలో పడ్డట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో స్టార్ డమ్ అందుకుంటున్న ఈ బ్యూటీ.. అప్పుడే హీరోతో ప్రేమలో పడటంతో అది కూడా ఓ సీనియర్ హీరోతో ప్రేమాయణం సాగించడంతో అభిమానులు కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అమ్మడి కెరీర్ ఖతమ్ అవుతుందని కొందరు నెటిజన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకూ ఆ యంగ్ బ్యూటీ ఎవరు.? ఆమె ప్రేమించిన సీనియర్ హీరో ఎవరు.? అనేది చూద్దాం. తెలుగులో ఎంతో మంది హాట్ బ్యూటీలు ఉన్నారు. ప్రస్తుతం దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్స్ వారిలో నిధి అగర్వాల్ ఒకరు. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చింది ఈ వయ్యారి భామ. ఈ ముద్దుగుమ్మ తన అందంతో కుర్రకారును కట్టిపడేసింది. అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది నిధి. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత అక్కినేని అఖిల్ తో మజ్ను అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా నిరాశపరిచింది. దాంతో ఈ బ్యూటీకి ఇక అవకాశాలు రావడం కష్టమే అని అనుకున్నారు అంతా.. ఆతర్వాత డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. ఇక ఈ సినిమాలో నటనతో పాటు గ్లామర్ పరంగాను ఆకట్టుకుంది. డబుల్ ఇస్మార్ట్ సినిమాలో నిధి అందాలకు కుర్రకారు ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ అయినా కూడా నిధికి అంతగా ఆఫర్స్ రాలేదు. మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరో అశోక్ గల్లా నటించిన హీరో అనే సినిమా చేసింది. ఇక ఇప్పుడు ఈ భామ వరుసగా రెండు భారీ సినిమాలు చేస్తోంది. కెరీర్ ఖతం అయ్యింది అని అనుకునేలోగా ఇద్దరూ బడా స్టార్స్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. నిధి అగర్వాల్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న హరిహరవీరమల్లు సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది. అలాగే ప్రభాస్ మారుతి దర్శకత్వంలో వస్తున్న రాజా సాబ్ సినిమాలోనూ నటిస్తుంది. అయితే నిధి అగర్వాల్ తమిళ్ హీరో శింబుతో ప్రేమలో పడిందని ఆమధ్య వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో నిధి ఆ రూమర్స్ ను కొట్టిపారేసింది. ఇప్పుడు మరోసారి నిధి శింబు ప్రేమాయణం గురించి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవలే టి నగర్‌లోని శింబు ఇంటికి మకాం మార్చినట్టు సమాచారం. ప్రస్తుతం ఇరు కుటుంబాలను ఒప్పించే పనిలో ఉన్నారట.

## పురమిత్ర యాప్‌తో ఎన్నో ప్రయోజనాలు

కాకినాడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవలందించేందుకు కొత్త అన్వేషణలు చేస్తోంది. ఇప్పటికే వాట్సాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనే పౌరసేవలను అందిస్తుంది. మరోవైపు రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ ప్రజలకు సేవలను అందించేందుకు "పుర మిత్ర" యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఉండేవారు పౌర సేవలను సులువుగా పొందేందుకు యాప్ ఉపయోగ పడుతుందని రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ చెబుతోంది. ఈ యాప్‌తో ప్రజలకు సమయం ఆదా అవుతుంది.రాష్ట్రంలోని 95 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో 17 మున్సిపల్ కార్పొరేషన్లు,78 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయాపట్టణాల్లో ఉండే ప్రజలు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాయాలచుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి వచ్చేది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయంలో సచివాలయాలు ఏర్పాటు తరువాత, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే వారి శాతం తగ్గింది. ఏ అవసరం వచ్చిన తమ సచివాలయానికి వెళ్లి పనిచేసుకునేవారు. ప్రజలకు అది కాస్త ఉపశమనంగానే ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డిజిటల్ సేవలను విస్తృతం చేసేందుకు సిద్ధపడింది.మున్సిపల్ కార్యాలయాలకు, గ్రామ సచివాలయాలకు రోజుల తరబడి తిరగాల్సిన పనిలేకుండా, గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా ఇంట్లో ఉండే అన్ని సేవలను పొందే విధంగా రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. "పుర మిత్ర" యాప్ ఇక నుంచి ప్రజలకు పౌర సేవలను అందించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో రూపొందించిన ఈ యాప్‌లో పలు సేవలు పొందే వీలు కల్పించింది.తమ సమస్యను రోజుల వ్యవధిలోనే పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. సమస్యను పంపేందుకు యాప్‌లో ఫీచర్స్ కూడా పొందుపరిచారు. మన చుట్టూ ఉన్న సమస్యను ఫోటో తీసి, వాయిస్ రికార్డుతో అక్షరాలను టైప్ చేసి పంపించే విధంగా యాప్‌ను తయారు చేశారు. పంపిన సమస్య, ఆ సమాచారం నేరుగా సంబంధిత విభాగాధికారికి వెళ్తుంది. పరిష్కారం చూసేందుకు కనీసం మూడు నుంచి 15 రోజులు, లేదా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు. సమస్య తీవ్రతను బట్టీ ఆయా రోజుల్లోపు పరిష్కారం చేస్తారు.రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ ఇలా 150 రకాల పౌర సేవలు "పుర మిత్ర" యాప్‌లో అందుబాటులో ఉంటాయి. పన్ను చెల్లింపులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు ఇలా అన్ని చెల్లింపులు ఇందులోనే చేసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలో ఏ మున్సిపాల్టీలోనైనా కంటికి కనిపించిన సమస్యను పరిష్కారం చేసుకోవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు. మనం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసేటప్పుడు ఆయా పట్టణాల్లో ఉన్న సమస్యను కూడా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉంది.ఆ సమస్య పరిష్కారానికి సంబంధించి మనకు తెలియజేస్తారు. సంబంధిత అధికారి గడువులోగా సమస్య పరిష్కరించాలి. పరిష్కారం అయిన ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు యాప్‌లో సమస్య పురోగతి తెలుసుకునేందుకు వీలు కల్పించారు. అధికారి సందించకపోతే, పై స్థాయి అధికారికి వెళ్లి, చివరికి బియ్యాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లి ఆ అధికారిని బాధ్యుడిగా చేస్తుంది."పుర మిత్ర" యాప్‌ను ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అప్పుడు ఓపెన్ బటన్‌ను క్లిక్ చేస్తే ఓపెన్ అవుతుంది. అందులో వివిధ ఫీచర్స్ ఉంటాయి. తెలుగులోనే ఉంటుంది. కనుక యాప్ ఉపయోగించడం చాలా సులువు. ప్రతి ఒక్కరూ యాప్‌ను ఉపయోగించే విధంగా డిజైన్ చేశారు.

## 'ఎస్ఎస్ఎంబి 29' మొదటి షెడ్యూల్ పూర్తి



రాజమౌళి, నటుడు మహేష్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా (ఎస్ఎస్ఎంబి29) మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయ్యింది. మహేష్‌బాబు, కథానాయిక ప్రియాంకా చోప్రాపై గత 15 రోజుల రెగ్యులర్ షూటింగ్ ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సీల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. నటీనటులను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు, తరలివచ్చారు. పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం నేతృత్వంలో పలువురు ప్రజాప్రతినిధులు చిత్రబృందాన్ని కలిసి అభినందించారు. అధికార యంత్రాంగం బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించింది.

## వరుస సినిమాలలో.. దూసుకెళ్తున్న మీనాక్షిచౌదరి



మీనాక్షి చౌదరి..సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది.హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. మీనాక్షి చౌదరి. సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది. హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. ఆ తర్వాత అడివి శేష్ సరసన 'హిట్-2'లో చేసింది.

కెరీర్ బిగినింగ్ లో కాస్త స్లోగా సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. కెరీర్ స్టార్టింగ్ లోనే సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం అందుకుంది. మహేష్ బాబు నటించిన గుంటూరు కారంలో నటించి మెప్పించింది. ఇవికాక రీసెంట్ గా విశ్వక్ సేన్, వరుణ్ తేజ్, దుల్కర్ సల్మాన్ హీరోలు సినిమాల్లో నటించి మెప్పించింది. రీసెంట్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. అలాగే కొన్ని తెలుగు సినిమాలను ఓకే చేసింది. ఇక సోషల్ మీడియా ఈ బ్యూటీ పంచుకునే ఫోటోలు కుర్రాళ్లను తెగ కవ్విస్తున్నాయి. ఇలాంటి లవర్ మనకు రావాలి అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. తన అందంతో అంతలా నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది ఈ చిన్నది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215